
ఆంధ్రజ్యోతి
****
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 26 ఏప్రిల్ 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 25.8

మోడువారుతున్న వనాలు

» ప్రజలకు అక్కరకు రాని పల్లె ప్రకృతి వనాలు



• 6లో

మిర్యాలగూడ మండలం హట్యాతండా పల్లె ప్రకృతి వనంలో మొక్కలను తింటున్న మేకలు

పట్టణ, పల్లె ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదాన్ని కల్పించడంతోపాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం పల్లె, పట్టణ పకృతి వనాలు, బృహత్ పల్లె పకృతి వనాలను ఏర్పాటుచేసింది. అయితే వీటి నిర్వహణకు నిధులు కేటాయించకపోవడం, వనాల్లో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఆలనాపాలనా లేక చాలా చోట్ల ఈ వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. కనీసం మొక్కలకు నీరు పోసే దిక్కులేకుండా పోయింది. కనీసం ఇక్కడ కూర్చేనేందుకు బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు లేవు. లక్షల రూపాలు ఖర్చుచేసి ఏర్పాటుచేసిన ప్రకృతి వనాలు ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండి అలంకారప్రాయంగా మారాయి.ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ప్రకృతివనాలపై దృష్టిసారించి ఆహ్లాదాన్ని కల్పించాలని పల్లె,పట్టణ వాసులు కోరుతున్నారు.

• ఊంజల్ సేవోత్సవం



యాదగిరిగుట్ట లక్ష్మీఅమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు • 7లో

ధాన్యం విక్రయానికి రైతులకు అవస్థలు తప్పడం లేదు. మిల్లుల వద్ద ధాన్యం కొనుగోళ్లపై నియంత్రణ లేకపోవడంతో మిల్లర్లు చెల్లించే ధరకే సన్న ధాన్యం విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మరో వైపు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటాల కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. సన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, మిల్లర్లు పచ్చి ధాన్యాన్ని కొనుగోలుచేస్తారని ధర తగ్గినా, బోనస్ కోల్పోతున్నా మిల్‌పాయింట్ల వద్దే రైతులు విక్రయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



తిప్పర్తి మండల కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం రాశులు

కొను 'ఘోల్లు'

» ధాన్యం విక్రయానికి రైతుల అవస్థలు
» కేంద్రాల వద్ద కాంటాల కోసం పడిగాపులు
» రవాణా, కాంటాల జాప్యంతో ఆవేదన
» బతిమాలితే తప్ప కొనుగోలు చేయని మిల్లర్లు
» ఏపీ రాష్ట్రం, పొరుగు జిల్లాల నుంచి భారీగా వస్తున్న ధాన్యం

రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని ధాన్యంలో నాణ్యత లేదని, మద్దతు ధర చెల్లించేది లేదని మిల్లర్లు మొండికేస్తుండగా రైతులు బతిమాలితేనే ధాన్యం కొనుగోలుచేసే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో ఉంది. ఏపీ రాష్ట్రంతో పాటు, తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి మిల్లులకు భారీగా ధాన్యం తరలి వస్తుండడంతో మిల్లర్లు స్థానిక రైతులకు ధరలో కోత విధిస్తున్నారు. సీజన్ ఆరంభంలో క్వింటాకు రూ.2700 ధర చెల్లించిన మిల్లర్లు ప్రస్తుతం రూ.2200 నుంచి రూ.2400కు మించి ఇవ్వడం లేదు.యాదాద్రి జిల్లాలో సన్నధాన్యం 20వేల మెట్రిక్‌టన్నులకు మించి ఉండదని అంచనావేయగా, దొడ్డురకాలు 5లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనావేశారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మాత్రం సుమారు 12.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం వస్తుందని అంచనావేశారు. మరో 13లక్షల మెట్రిక్‌టన్నుల దొడ్డురకాల ధాన్యం ఈ జిల్లాలో వస్తుందని చెబుతున్నారు. అందులో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నధాన్యం కేవలం 17వేల మెట్రిక్‌టన్నులలోపే వచ్చింది. దొడ్డురకం ధాన్యం మూడు జిల్లాల్లో కలిపి సుమారు 2.54 లక్షల మెట్రిక్‌టన్నులమేర కొనుగోలు చేశారు.

రవాణా, కాంటాల్లో జాప్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు తీవ్ర జాప్యమవుతున్నాయి. కేంద్రాల వద్ద ఎక్కడ చూసినా వేలాదిబస్తాల ధాన్యం అలాగే ఉంటోంది. సరిపడా లారీలు లేకపోవడం, మిల్లు లు, గోదాముల వద్ద వెంటనే దిగుమతి చేసుకోకపోవడం తదితర కారణాలతో రవాణా తీవ్ర జాప్యమవుతోంది. అదే సమయంలో తేమశాతం ఎక్కువగా ఉందని, తాలు ఉంటుందని చెబుతూ నిర్వాహకులు కాంటాలు వేయడంలో జాప్యం చేస్తున్నారని పలు కేంద్రాల వద్ద రైతులు వాపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ధాన్యం కొనుగోలు చేసే దిక్కులేకపోవడంతో చేసేదేమీలేక 15 రోజుల వరకైనా వేచి ఉండి, ధాన్యం కాంటాలు వేయించి వెళ్తున్నామని రైతులు చెబుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో కొనుగోళ్లలో జాప్యం

సూర్యాపేట జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలులో తీవ్రజాప్యం జరుగుతోంది. ఈ సీజన్‌లో జిల్లాలో 4లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 56వేల మెట్రిక్‌టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారు. అందులో సన్నధాన్యం 13వేల మెట్రిక్‌టన్నులకే పరిమితమైంది. జిల్లాలో మొత్తం 327 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో 76 కేంద్రాలు సన్నధాన్యానికి కేటాయించారు. తేమశాతం ఎక్కువగా ఉందని కాంటాలు వేయడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా లారీలు వెనువెంటనే రాకపోవడంతో...

- మిగతా 7వ పేజీలో...

నల్లగొండ జిల్లాలో కిక్కిరిసిన కొనుగోలు కేంద్రాలు

నల్లగొండ జిల్లాలో వరి కోతలు దాదాపు ముగియడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాశులతో కిక్కిరిసిపోతున్నాయి. ఏ కొనుగోలు కేంద్రం వద్ద చూసినా వేలాది బస్తాల ధాన్యం నిల్వ ఉంది. కేంద్రాల వద్దనే రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. భారీగా ధాన్యం వస్తుండడంతో లారీల కొరత ఏర్పడింది. దీంతో కాంటాల కోసం రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఒక్కో రైతు కనీసం 10 నుంచి 15 రోజుల వరకు ధాన్యం విక్రయించడానికి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సన్నధాన్యం దాదాపుగా మిల్‌పాయింట్ల వద్దనే విక్రయిస్తుండగా, దొడ్డు ధాన్యం పూర్తిగా కొనుగోలు కేంద్రాలకు వస్తోంది. జిల్లాలో యాసంగి సీజన్‌లో 12.14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనావేయగా, అందులో 11.28లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని, మిల్లర్లు 5.70లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తారని అధికారులు అంచనావేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సుమారు 5.70లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో సన్నధాన్యం కొనుగోలుకు 71 కేంద్రాలు ఏర్పాటు చేయగా, దొడ్డురకం ధాన్యం కోసం 304 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సన్నధాన్యం కేవలం 3,524 మెట్రిక్ టన్నులు మాత్రమే ఈ కేంద్రాల్లో సేకరించగా, దొడ్డురకం ధాన్యం సుమారు 1.96లక్షల మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేశారు.

సాగర్ ఎడమ కాల్వను పరిశీలించిన

కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్



సాగర్ ఎడమకాల్వ వద్ద ప్రాజెక్టు అధికారులతో కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ క్వాలను కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్ శుక్రవారం సందర్శించారు. రెండు రోజుల సాగర్ పర్యటనలో భాగంగా గురువారం ఇక్కడికి వచ్చిన ఆయన తొలిరోజు సాగర్ ప్రధాన డాం, కుడి కాల్వ, కుడి కాల్వపై ఉన్న జల విద్యుత్ కేంద్రం, ప్రధాన జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. రెండో రోజు శుక్రవారం తిరుగు ప్రయాణంలో ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటరీ, ఎడమ కాల్వపై ఉన్న జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎడమ కాల్వ నీటి విడుదల వివరాలను, జల విద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి ద్వారా చేస్తున్న నీటి విడుదల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రాజెక్టు ఈఈ మల్లిఖార్జునరావు, ఇతర అధికారులు ఉన్నారు.

ఖైదీల్లో మార్పు వచ్చేలా చూడాలి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీంఅక్తర్



జైలు అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న షమీంఅక్తర్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీల్లో మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీంఅక్తర్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని జిల్లా జైలును ఆయన తనిఖీచేసి బ్యారక్స్, వంటగది, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా జైలులో సుమారు 177 మంది ఖైదీలు ఉన్నారని, అందులో 21 మంది మహిళా ఖైదీలు ఉన్నారన్నారు. జైలులో సౌకర్యాలన్నీ పరిశీలించి ఖైదీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్టు చెప్పారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఖైదీల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జిల్లా జైలర్ బాలకృష్ణ ఉన్నారు. అంతకుముందు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌కు ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, సంక్షేమ హాస్టళ్ల ద్వారా అందిస్తున్న సేవలు, ఇతర కార్యక్రమాలను అధికారులు ఆయనకు వివరించారు. అదేవిధంగా చైర్మన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

గూడ్స్ రైలు బోగీలో పొగలు

● యాదాద్రి జిల్లా ఆలేరు వద్ద ఘటన • 7లో
● సకాలంలో స్పందించిన సిబ్బంది.. తప్పిన ప్రమాదం

సమస్యల పరిష్కారమే భూభారతి లక్ష్యం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



దామరచర్లలో భూభారతి అవగాహన సదస్సులో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ఉన్న వారసత్వ, వివిధ రకల భూముల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. గతంలో ప్రభుత్వం పేదలకు అందించిన అసైన్డ్ భూముల్లో క్రయవిక్రయాలకు అనుమతి లేకున్నా, కొందరు వారి అవసరాల కోసం అవగాహన లోపంతో విక్రయించారన్నారు. గతంలో రికార్డుల్లోకి ఎక్కిన భూములను సైతం పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 14 నెలల పాటు నిపుణుల కమిటీ పర్యవేక్షణలో నూతన భూభారతి చట్టాన్ని రూపొందించిందన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పేదల పక్షపాతి అని అన్నారు. అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను తిరిగి పునరుద్ధరించనుందన్నారు. ధరణిలో అప్పీల్ వ్యవస్థ లేదని, తహసీల్దార్ తప్పు చేస్తే భూభారతి చట్టంలో సవరించే అవకాశం ఆర్డీవోకు ఉందన్నారు. భూముల సర్వే కోసం లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి నియమించనుందన్నారు. దీంతో రైతుల భూములకు హద్దులు కల్పించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఫలాలు పేదలకు చేరేలా అధికారులు, కిందిస్థాయి సిబ్బంది కృషి చేయాలన్నారు. వజీరాబాద్ మేజర్ పరిధి 37కిలోమీటర్ల మేర ఉండగా గతంలో 20వేల నుంచి 30వేల ఎకరాలు మాత్రమే సాగు కాగా, ప్రస్తుతం 45వేల ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. పూర్తిస్థాయిలో భూప్రక్షాళన చేసి అర్హులైన రైతులకు పట్టాలను అందజేస్తామన్నారు. లక్ష్మీపురం గ్రామంలో 2022లో 437 సర్వే నెంబర్‌లో 4.37 ఎకరాల భూమి కొనుగోలు చేసినా అప్పటి ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని, తాను ఎమ్మెల్యేగా గెలిచాక, ఆ భూమిని చదును చేయించి పేదలకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఇళ్లు లేని 80మంది నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేశారు. కలెక్టర్‌తో పలువురు గిరిజన మహిళలతో కలిసి వారి సంప్రదాయ నృత్యం చేయడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్లు హరిజవహర్‌లాల్, శ్రీనివాస్, పుష్పలత, హరిబాబు, ఎంపీడీవో శారదాదేవి, డీటీ కోటేశ్వరి, ఆర్ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, నాయకులు పొదిల శ్రీనివాస్, మాలి కాంతారెడ్డి, రావు ఎల్లారెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రవీణ్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ మండలం లక్ష్మీపురంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్ఆర్

రజతోత్సవ సభను

విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రె స్ హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలిరావడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. రజతోత్సవ సభను ప్రజలు కాంగ్రెస్ వ్యతిరేక సభగా భావిస్తున్నారని, కేసీఆర్ మాట్లాడేది వినేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలిరానున్నారని అన్నారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్యలో ఉండి కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యొల్గురి వల్లపు రెడ్డి, నాయకులు ముత్యంరావు, ఆర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి, రాయనబోయిన శ్రీను, సుధాకర్‌గౌడ్, బోడ్డుపల్లి మహేందర్, మన్యానాయక్, కృష్ణారెడ్డి, హరిరాథోడ్, వెంకటయ్య, అనిల్, రవి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



చిట్యాలలో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చిట్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చిట్యాల పట్టణంలో జాతీయరహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిట్యాల వద్ద జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, పనులు కొనసాగుతున్నందున రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హైవేపై ట్రాఫిక్‌జామ్ ఏర్పడకుండా, వాహనాలు సాఫీగావెళ్లేలా ట్రాఫిక్‌ను డైవర్షన్ చేయాలన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయనవెంట డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మా, తదితరులు ఉన్నారు.

దోస్తులంతా కలిసి

దొంగతనాలకు

● వ్యవసాయ మోటార్ల దొంగల ముఠా అరెస్ట్ • 7లో

అమాయకులపై ఉగ్రదాడి హేయం

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైనదని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. పెహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ టీపీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకులపై తూపాకుల తూటాలు పేల్చడాన్ని యావత్ దేశమంతా ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, గోపగాని మాధవి, దుబ్బ అశోక్, వంగూరు లక్ష్మయ్య, దుబ్బరూప, నాగమణిరెడ్డి, నాగరాజు, ఇంతియాజ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



అర్చకత్వమే కాదూ హలమూ పట్టా


▸ చిన్నతనంలో వేసవి సెలవుల్లో జ్ఞాపకాలు మధురం

▸ చెర్వుగట్టు క్షేత్ర ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ

నా బాల్యం

(ఆంధ్రజ్యోతి-నార్కట్‌పల్లి)

తాము అర్చకత్వంతో పాటు వ్యవసాయం చేసేవాళ్లమని, చిన్నతనంలో వేసవి సెలవుల్లో హలం పట్టిన రోజులూ ఉన్నాయని నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ. బాల్యంలో వేసవి సెలవుల్లోని జ్ఞాపకాలపై 'ఆంధ్రజ్యోతి'కి ఆయన వివరించారు. ఆయన మాటల్లోనే... స్వతహాగా ఆయుర్వేద వైద్యుడైన మా తండ్రికి ప్రకృతి మొక్కల ద్వారా ఆయుర్వేద ఔషధాల తయారీ, బాధితులకు వైద్యపరీక్షల విషయంలో సాయంగా ఉండేవాడిని. మాకు వ్యవసాయం ఉండేది. అప్పుడప్పుడు హలం పట్టి పొలం కూడా దున్నిన రోజులూ ఉన్నాయి. మా తాత గారి నుంచే పశుపోషణ ఉండేది. వ్యవసాయ బావి వద్ద ఉన్న గోవుల ఆలనా పాలన కూడా చూశా. నాది వారసత్వంగా అర్చకత్వ కుటుంబం, ప్రతీ నిత్యం ఉదయం, సాయంత్రం సూర్య, సంధ్యార్చనలు చేసి మడికట్టుకుని పూజాధికాలతో భగవంతుని అర్చించే తండ్రి పోతులపాటి లచ్చయ్య, అన్నయ్య సోమశర్మల పెంపకంలో పెరిగా. ఆ కారణంగా నా 7వ యేటనే ఉపనయనం చేశారు. మా నాన్న, అన్నయ్యల పర్యవేక్షణలో ఇంట్లో ఉండే దేవతామూర్తుల పూజా విధానాలు, ఆలయంలో మూల దేవతావిగ్రహాల పూజా విధానాలపై వేసవి సెలవుల్లో అవగాహన కల్పించేవారు. రామాయణ, మహాభారత, భాగవత గ్రంథాలపై భక్తులకు చెప్పే విధంగా తర్ఫీదు ఇచ్చేవారు. దేశవ్యాప్తంగా హిందూ ధర్మ స్థాపనకు కృషి చేసిన ఆదిశంకరాచార్యుల బోధనలు, రచనలు నేను నేర్చుకున్నా.



రోజురోజుకూ పెరుగుతున్న భానుడు ప్రతాపంతో ఎండలు మండుతున్నాయి. ఈ నెలలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతతో అల్లాడుతున్న ప్రజలు మే నెలలో పరిస్థితి ఏవిధంగా ఉంటుందోనని భయాందోళనకు గురవుతున్నారు. మండుతున్న ఎండలతో అప్రమత్తంగా లేకపోతే ప్రాణానికే ప్రమాదమని వైద్యులు సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన జగన్నాథచార్యులు పేర్కొంటున్నారు. ఏ కొంచెం ఏమరుపాటుగా ఉన్నా వ్యాధులు తప్పవంటున్నారు. ముందు జాగ్రత్తలు పాటిస్తే, వేసవి నుంచి, వ్యాధుల నుంచి బయటపడ వచ్చునంటున్నారు. వేసవిలో చల్లదనం కోసం తీసుకునే నీరు, పండ్ల రసాలు, రాత్రి ఆరుబయటపడుకుంటే దోమలతో అప్రమత్తంగా ఉంటే వ్యాధులకు దూరం కావచ్చునని చెబుతున్నారు. మధ్యాహ్నం బయటకు వెళ్లేటప్పుడు గొడుగులు, టోపీలు వాడాలని, సన్‌స్క్రీన్‌లోషన్ ఉపయోగించటంతో ఎండ నుంచి శరీరాన్ని రక్షించుకోవచ్చునంటున్నారు.

- (ఆంధ్రజ్యోతి-కోదాడ)

ఎండే కదా అనుకున్నారో..

▸ వేసవిలో వ్యాధులు అధికం ▸ ఎండదెబ్బ నుంచి మొదలు విషజ్వరాల వరకు ప్రమాదమే ▸ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిందే





ఎండతో వచ్చే ఇబ్బందులు



విపరీతమైన ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల మూలంగా వేసవిలో ఎదురయ్యే ప్రధాన సమస్యలు ఎండదెబ్బ, వడదెబ్బ. రెండింటిలో వడదెబ్బ మరింత ప్రమాదకరమంటున్నారు వైద్యులు. ఎండదెబ్బ తగిలినప్పుడు విపరీతంగా చెమటపోసి, ఒంట్లోంచి లవణాలు ఎక్కువగా బయటకుపోతాయి. దీంతో తీవ్రనీరసం, కండరాలనొప్పి, తలనొప్పి, స్థిమితంలేకపోవడం వంటివి మొదలవుతాయి. ఇటువంటి పరిస్థితిలో వ్యక్తిని వెంటనే చల్లటి ప్రదేశానికి తరలించాలి. చెమటద్వారా కోల్పోయిన లవణాల భర్తీకి ప్రతి 10 నిమిషాలకు కొద్దిగా ఉప్పు కలిపిన నీరు, పళ్లరసం వంటివి తాగించాలి.

ప్రాణాంతకం.. వడదెబ్బ..

ఎండ తీవ్రతకు శరీరంలో ఉష్ణోగ్రతను నియంత్రించే యంత్రాంగం అస్తవ్యస్తమై వడదెబ్బ తగలొచ్చు. మంటలతో జ్వరం, ఒళ్లు వేడెక్కిపోతుంటుంది. కానీ చెమటరాదు. విపరీతమైన దప్పిక, మగత, తలతిప్పడం, నాడి వేగంగా కొట్టుకోవడం, స్పృహతప్పటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అటువంటి వారికి తక్షణమే చికిత్స అవసరం. ఇటువంటి వారికి గాలి విసరాలి, తడివస్త్రంతో ఒళ్లంతా తుడుస్తుండాలి. వెంటనే వైద్యుల వద్దకు తీసుకువెళ్లాలి.

దోమలతో డెంగీ



సాధారంగా వేసవిలో వాతావరణ మార్పులతో దోమల సంతతి పెరుగుతుంది. దీంతో అవి తీసుకువచ్చే వ్యాధులు కూడా ఎక్కువ. శుభ్రమైన నీటిలో పెరిగే ఈడీస్ ఈజిప్ట్ రకం దోమ ద్వారా డెంగీ జ్వరాలు విజృంభిస్తాయి. ఇళ్లలో వాడే కూలర్లలో, మూతలేని నీళ్ల ట్యాంకుల్లో, పూల కుండీల్లో, పాత టైర్లు, కొబ్బరి చిప్పల వంటివాటిల్లో ఈ దోమలు పెరుగుతాయి. అవి కుడితే జ్వరం ఒకేసారి వణుకుతో మొదలై 101 నుంచి 104 డిగ్రీల వరకు రావచ్చు. అంతేకాక తీవ్రమైన తలనొప్పి, ఒళ్ళునొప్పులు, కండరాలు, కీళ్లనొప్పులు వస్తాయి. ఇతరత్రా లక్షణాలు లేకుండా తీవ్రంగా జ్వరం వచ్చిందంటే అది డెంగీ జ్వరంగా అనుమానించి వైద్యులను సంప్రదించాలి.

మలేరియాతి: దోమలతో మరో సమస్య మలేరియా. ఆడ అనాఫిలస్ దోమ ద్వారా వ్యాపించే ప్లాస్మోడియం పరాన్న జీవి దీనికి కారణం. హఠాత్తుగా విపరీతమైన చలి, వణుకు, ఆ వెంటనే జ్వరం రావటం మలేరియా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

చికున్‌గున్యా: ఈడిస్ ఈజిప్ట దోమద్వారా వ్యాపించేదే చికున్‌గున్యా. ఈ వైరస్ ఉన్న వాళ్లను కుట్టిన దో మ మరొకరని కుట్టటం ద్వారా ఇది ఇతరులకు సంక్రమిస్తుంది.దీని బారిపడిన వారు జ్వరం, ఒళ్ళునొప్పులు, ము ఖ్యంగా కీళ్లనొప్పులు తీవ్రంగా ఉంటాయి.



వైరస్‌లతో వచ్చే జబ్బులు..



ఆటలమ్మ: ఉష్ణోగ్రతలలో వచ్చే మార్పులతో వేసవిలో ఆటలమ్మ(చికెన్ పాక్స్) విస్తరిస్తుంది. దీనికి సెల్లా జోస్టర్ అనే వైరస్‌మూలం. దీని బారినపడిన వారు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు గాలిలో వ్యాపించే తుంపర్ల ద్వారా వైరస్ ఇతరులకు సోకుతుంది. ఆటలమ్మ సాధారణంగా పిల్లల్లో ఎక్కువ. దీంతో చర్మంపై అక్కడక్కడ సన్నటి, ఎర్రటి పొక్కులు మొదలవుతాయి. క్రమేపీ అవి ఒళ్లంతా వ్యాపిస్తాయి. ఈ సమయంలో బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి, విశ్రాంతి తీసుకోవాలి. 10 రోజుల్లో తగ్గిపోతుంది. ఒకసారి ఆటలమ్మ వచ్చినవారికి మళ్లీ ఎప్పుడూ రాదు, ఆటలమ్మ రాకుండా టీకా అందుబాటులో ఉంది.

కళ్ల కలక: వేసవిలో ఉష్ణోగ్రతల్లో వచ్చే మార్పుల కారణంగా చాలారకాల వైరస్‌లు విజృంభిస్తాయి. కళ్లకలక కూడా వైరస్‌ల కారణంగా విస్తరించే సమస్యే. ముఖ్యంగా వేసవి ఆరంభంలో ఈ సమస్య చాలాఎక్కువ. కళ్లు ఎర్రబడటం, కళ్ల నొప్పి, దురద, వెలుగు చూడలేకపోవటం, రెప్పలపై ఊసులు కట్టటం వంటి లక్షణాలు కనబడతాయి. కలక వచ్చినవారు కళ్లను ఆదేపనిగా రుద్దకుండా, కళ్లను శుభ్రమైన నీటితో కడుక్కుని, పొడివస్త్రంతో అద్దుకోవచ్చు. దీంతో రెండుమూడు రోజుల్లో దానంతట అదే తగ్గిపోతుందని వైద్యులు పేర్కొంటున్నారు. అదేవిధంగా గవదబిళ్లలు కూడా వేసవిలో ఒకరి నుంచి మరొకరికి వ్యాపించి వేధిస్తూ ఉంటాయి. అందువల్ల వేసవిలో వ్యాధుల, ఎండలతో అప్రమత్తంగా ఉంటే తమను తాము రక్షించుకోవచ్చునని వైద్యుడు జగన్నాథచార్యులు సూచిస్తున్నారు.

నీరు, పండ్ల రసాలతో వచ్చే వ్యాధులు



విరేచనాలు: ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఎక్కడపడితే అక్కడ నీరు, పండ్ల రసాలు తాగుతుంటారు. శుభ్రత లేకపోతే నీళ్ల విరేచనాలు అవుతుంటాయి. దీంతో ఒంట్లో నీరు తగ్గిపోవచ్చు(డీహైడ్రేషన్). ఇది చాలా ప్రమాదకరం. ఇటువంటి సమయంలో ఒంట్లో నీరు తగ్గకుండా మజ్జిగ, కొబ్బరినీరు, ఓఆర్ఎస్‌లాంటివి ఎక్కువగా తీసుకోవటం మంచిది.

టైఫాయిడ్

తాగునీరు కలుషితమయ్యే ప్రాంతాల్లో టైఫాయిడ్ ముప్పు ఎక్కువ. టైఫాయిడ్ జ్వరాలకు మూలం సాల్మొనెల్లా టైఫీ అనే బ్యాక్టీరియా. ఇది ఉన్న వ్యక్తి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కొద్దిగా మొదలై జ్వరం పెరుగుతూ తీవ్రస్థాయికి చేరుకోవటడమే దీని లక్షణం. అంతేకాక వాంతులు, ఆకలి మందగించడం, కడుపునొప్పి, ఒళ్ళునొప్పులు, నీరసంలాంటివి కనపడతాయి. సరైన చికిత్స తీసుకోకపోతే వారాలకొద్దీ జ్వరం విడవకుండా వేధిస్తుంటుంది. మందులేకాక ఇటీవల టైఫాయిడ్ రాకుండా టీకా కూడా అందుబాటులోకి వచ్చింది.

ఆహారం, నీరు కలుషితంతో కామెర్లు

వేసవిలో నీరు, ఆహారం కలుషితం కావటం వల్ల కామెర్లు కూడా విజృంభిస్తుంటాయి. దీనికి హెపటైటిస్ ఏ, ఇ వైరస్‌లు మూలం. కామెర్లతో ఆకలి మందగించడం, కొద్దిపాటి జ్వరం, మూత్రం పచ్చగా రావటం, కళ్లు, చర్మం పచ్చగా మారటం వంటి లక్షణాలు కనబడతాయి. కాగా కామెర్లు అశ్రద్ధ చేయరాదు. తగిన జాగ్రత్తల కోసం వైద్యులను సంప్రదించాలి, లేకుంటే ప్రాణానికే ప్రమాదం.

మూత్రంలో ఇన్ఫెక్షన్లు

వేసవిలో తగినంత నీరు తాగకపోతే మూత్రనాళ ఇన్ఫెక్షన్లుకు దారితీసే అవకాశం ఉందంటున్నారు వైద్యులు. ఈ సమస్య పురుషుల కంటే మహిళలకు ఎక్కువగా ఉంటుంది. వేసవిలో దాహం వేసేంత వరకూ ఆగకుండా మధ్యమధ్యలో రోజంతా తరుచుగా నీళ్ల తాగుతుండటం ఉత్తమమంటున్నారు. లేదంటే మూత్ర సమస్యలు రావచ్చునంటున్నారు.

ముక్కు నుంచి రక్తం

ఎండవేడికి ముక్కులు పొరబారి, రక్తనాళాలు చిట్లే ప్రమాదముంది. దీంతో చాలా మంది పిల్లలకు ముక్కు నుంచి రక్తం కారుతుంటుంది. ఇటువంటి సందర్భాల్లో తల ముందుకు వంచి ముక్కును వేలితో 10 నిమిషాల పాటు నొక్కిపట్టి ఉంచితే రక్తం గడ్డకట్టి కారటం ఆగిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు. అదే విధంగా వేసవిలో చర్మం మీద స్వేదరంధ్రాలు మూసుకుపోవటం వల్ల వేసవిలో మెడ, భుజాలు, ఛాతీ వంటి ప్రదేశాల్లో ఎర్రగా సన్నటి చెమట పొక్కులు వస్తాయి. ఇటువంటి పరిస్థితిలో చెమట పట్టకుండా డస్టింగ్ పౌడర్ వంటివి అద్దుకోవటం ద్వారా వాటిని నివారించుకోవచ్చునని సూచిస్తున్నారు.

మోడువారుతున్న వనాలు

● నిర్వహణ లేక ఎండుతున్న మొక్కలు

● నిధుల లేమితో అధికారుల నిర్లక్ష్యం

● ఆహ్లాదం లేక వనాలకు వెళ్లని ప్రజలు

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు/రాజాపేట/ భువనగిరి టౌన్, రూరల్ / సంస్థాన్‌నారాయణపురం / ఆత్మకూరు(ఎం)

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో గత ప్రభుత్వం గ్రామాల్లో, పట్టణాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు, బృహత్ ప్రకృతి వనాలు, పట్టణ ప్రకృతి వనాలు ఆలనా, పాలనా లేక చెత్తా,చెదారంతో నిండిపోయాయి. ప్రజలు ఆహ్లాదంగా గడిపేందుకు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో సరైన ఏర్పాట్లు లేక లక్ష్యం నెరవేరడం లేదు. ఊరికి దూరంగా అలంకారప్రాయంగా మారాయి. చాలాచోట్ల నీళ్లు లేక చెట్లు ఎండిపోతున్నాయి.

యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలంలో 10 పంచాయతీలు ఉండగా 10 బృహత్ ప్రకృతివనాలు, మూడు పల్లె ప్రకృతివనాలు ఏర్పాటుచేశారు. అందులో రాగిబావి పల్లె వనానికి వెళ్లేందుకు దారిలేక నాటిన మొక్కలకు నీరు పోయక ఎండిపోయాయి. మిగతా గ్రామాల్లో మొదట్లో ఉపాధి సిబ్బంది రెండేళ్లు ప్రకృతి వనాలను పెంచి పంచాయతీలకు అప్పగించారు. ఇప్పుడు ప్రత్యేక వాచర్ లేదు. గ్రామపంచాయతీ వారే అప్పుడప్పుడు నీరు పోస్తున్నారు. ప్రకృతి వనాలకు వెళ్లి ఆహ్లాదంగా గడపడానికి అక్కడ కూర్చోవడానికి బెంచీలు, పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాట్లు లేవు. కనీసం వనభోజనాలకు వెళ్లినట్టుగా చెట్లు కింద కూర్చొని భోజనాలు చేసే పరిస్థితి లేదు. మోత్కూరులోని ప్రకృతి వనాలు నిర్వహణ సక్రమంగా లేక చెత్తాచెదారంతో నిండిపోయాయి. 8 వనాలు ఏర్పాటుచేసినా అవి ఏమాత్రం ప్రజలకు ఉపయోగపడేలా లేవు. మోత్కూరు శివసాయినగర్ వెంచర్‌లోని వనంలో ఏర్పాటు చేసిన నర్సరీలోని మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి.

● రాజాపేట మండలకేంద్రంలోని పల్లె ప్రకృతి వనాన్ని వెంచర్‌లో ఏర్పాటుచేశారు. కొన్నిచెట్లను నాటినా పట్టించుకునే వారే కరువయ్యారు. నిర్వహణ చూసేవారు లేక అస్తవ్యస్తంగా తయారయ్యాయి.

● భువనగిరి పట్టణంలో రూ.25 లక్షలతో అభివృద్ధి చేసిన 8 ప్రకృతివనాల నిర్వహణ లోపభూయిష్టంగా ఉండటంతో ఉనికిని కోల్పోతున్నాయి. పలువార్డుల్లో 25కు పైగా ఖాళీ ప్రదేశాలలో ప్రకృతి వనాల పేరిట మొక్కలు నాటారు. ఒకటి, రెండు చోట్ల మొక్కలుచిగురుస్తుండగా, మిగతాచోట్ల పచ్చదనం రికార్డులకే పరిమితమైంది.సరిపడానీరు పోయకపోవడం, మొక్కల సరక్షణ లేక వనాలు బీడుభూముల్లా కనిపిస్తున్నాయి.

●సంస్థాన్‌నారాయణపురం మండలకేంద్రంలోని పల్లె ప్రకృతివనం నిర్వహణ కోసం ప్రత్యేకంగా వనమాలిని నియమించారు. దీంతో మొక్కలు ఎండిపోలేదు. అయితే వనం ఊరికి చివరన ఉండటంతో ప్రజలకు పెద్దగా ఉపయోగపడడం లేదు. సేదతీరేలా సౌకర్యాలు కల్పిస్తే ఉపయోగపడే అవకాశం ఉంటుందన్నారు.

● ఆత్మకూరు(ఎం) మండలంలో 23పంచాయతీల్లో ప్రకృతి వనాలను ఏర్పాటుచేశారు. నిర్వహణను చూస్తున్న వాచర్లను తొలగించడంతో నిర్వహణ సరిగా లేక అస్తవ్యస్తంగా మారాయి. కొన్ని చోట్ల వనాల్లో మొక్కలు, చెట్లు బాగానే ఉన్నాయి.

● భువనగిరి మండలంలో పల్లెప్రకృతి వనాలు ఆదరణకు నోచుకోవడం లేదు. 2019 నుంచి 2024 వరకు వనసేవకులను ఏర్పాటుచేసి మొక్కల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. అయితే ఈ ఏడాది వనాల బాధ్యతలను గ్రామపంచాయతీలకు అప్పగించారు. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారులను నియమించడంతో కార్యదర్శులకు నిధులు కేటాయించకపోవడంతో వనాల నిర్వహణ నిర్లక్ష్యానికి గురైంది. వన సేవలకులు లేకపోవడంతో మొక్కలు ఎండిపోయినట్లు అధికారులు తెలిపారు. అయితే కొన్నేళ్లు నిర్వహణ ఉండటంతో ఉసిరి, సీతాఫలం, జామ, గుల్‌మోర్, టెకోమా సీమా, తంగెడు, ఈత, కర్జూర, వేప తదితర మొక్కలు వేపుగా పెరిగి కొంతమేర పచ్చదనం కనిపిస్తోంది.

● బొమ్మలరామారం మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన పల్లె ప్రకృతి వనాన్ని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేయడం, వన సంరక్షకుడు లేకపోవడంతో చెట్ల చుట్టూ గడ్డి పెరిగింది. ప్రతిరోజూ సమీపంలోని మైసమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు అక్కడే భోజనాలు చేస్తూ ఉన్నారు. మూడేళ్ల క్రితం సర్పంచ్ రాంపల్లి మహేష్‌గౌడ్ పంచాయతీ నిధులు రూ.1.50 లక్షలతో మొక్కలను పర్యవేక్షించారు. ఆయన పదవీకాలం ముగియడంతో వనాన్ని పట్టించుకునే వారు లేరు.

ఆంధ్రజ్యోతి విజిట్



గుండాల ప్రకృతి వనంలో ఎండిపోయిన మొక్కలు

● గుండాల మండలంలో ప్రకృతి వనాలు నిర్వహణ లేకపోవడంతో కళావిహీనంగా కనిపిస్తున్నాయి. ఉపాధి కూలీలతో నీటిని పోయించాలని ఆదేశాలు ఉన్నా పట్టించుకున్నవారు లేరు. గుండాల, పాచిల్లా, నూనేగూడెం, రామారం, సీతారాంపురం వనాల్లో చెట్లుఎండిపోతున్నాయి. అధికారులను వనాలను కాపాడే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో...

(ఆంధ్రజ్యోతి-మోతె/ నూతనకల్/ తిరుమలగిరి/ మేళ్లచెర్వు)



తిరుమలగిరి వన నర్సరీలో ఎండిపోయిన మొక్కలు

● మోతె మండలంలో వనాల్లో ఎండిపోయిన చెట్లు కనిపిస్తున్నాయి. వనాల చుట్టు ఏర్పాటుచేసిన ఫెన్సింగ్, విద్యుత్ తీగలు, పైపులు చోరీకి గురయ్యారు. 29 గ్రామాల్లో రూ.3 లక్షల వరకు ఖర్చు చేసి వనాలను ఏర్పాటుచేసి ఏడాదిగా వదిలేశారు. విభలాపురంలో రూ.20 లక్షలతో ఏర్పాటుచేసిన బృహత్ పల్లెప్రకృతి వనం బాధ్యతలను పంచాయతీకి అప్పజెప్పిన నాటి నుంచి పర్యవేక్షణ కరువైంది. దీంతో వనాన్ని ఆక్రమించుకోవడంతో పాటు తీగలు, స్తంభాలను, పైపులు చోరీకి గురవుతున్నాయి. చాలాచోట్ల వనాలు ఎండిపోయాయి.

● నూతనకల్ మండలం మిర్యాల గ్రామంలో ఏడున్నర ఎకరాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటుచేశారు. రెండేళ్లు వనసేవకులను నియమించి మొక్కలను సంరక్షించారు. ప్రస్తుతం వనసేవకులు లేకపోవడంతో మొక్కలకు నీళ్లు పోసేవారు లేక చాలావరకు ఎండిపోయాయి. ప్రస్తుతం పంచాయతీ సిబ్బంది మొక్కలకు నీరు పోస్తున్నారు. పల్లెప్రకృతి వనంలో ఏర్పాటుచేసిన నర్సరీల్లో గింజలు మొలక రాక చనిపోయాయి. గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలకు సరైన సమయంలో నీళ్ల పోయకపోవడంతో మొక్కలు చనిపోతున్నాయి.

● తిరుమలగిరిలో ఏర్పాటుచేసిన నర్సరీలు అధికారుల నిర్లక్ష్యంతో కళతప్పాయి. వనసంరక్షకులు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. మొక్కల రక్షణకోసం ఏర్పాటుచేసిన నెట్లు చిరిగిపోయాయి. నర్సరీల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. తిరుమలగిరి పరిధిలో 2020లో ఒక్కో నర్సరీ రూ.5 లక్షల చొప్పున మూడు నర్సరీలను ఏర్పాటుచేశారు. నేడు ఆ నర్సరీలు నిరక్ష్యానికి గురై, సంరక్షకులు లేక మొక్కలు ఎండిపోయాయి.

● మేళ్లచెర్వు మండలవ్యాప్తంగా పల్లె ప్రకృతి వనాల నిర్వహణను అధికారులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. వేసవి కావడంతో వేడికి కొన్నిరకాల మొక్కలు ఎండిపోతున్నా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవడంలేదు. వర్షాకాలం వరకు మొక్కలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

నల్లగొండ జిల్లాలో

(ఆంధ్రజ్యోతి- కొండమల్లేపల్లి / కేతేపల్లి /

కొండమల్లేపల్లి మండలంలో 26 పంచాయతీలు ఉండగా 24చోట్ల పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటుచేశారు. వన సంరక్షణ బాధ్యతలు చూసేవారు లేక మొక్కలు ఎండిపోతున్నాయి. ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్న తరుణంలో పంచాయతీలకు నిధులలేమితో మొక్కల సంరక్షణ భారమైంది. చెన్నంనేనిపల్లి, ఆంబోతుతండా, గన్యానాయక్‌తండాల్లోని పల్లె ప్రకృతి వనాల్లో నీళ్ల లేక మొక్కలు ఎండిపోతున్నాయి.

● కేతేపల్లి మండలకేంద్రంలోని పల్లె ప్రకృతివనం పర్యవేక్షణాలోపంతో లక్ష్యానికి ఉంది. మూడేళ్లుగా నిర్వహణ లేక నీరసించిపోతోంది. గ్రామానికి కిలోమీటరు దూరంలోని నిమ్మలమ్మ చెరువుకట్ట దిగువన వనాన్ని ఏర్పాటు చేయడంతో వనం వైపు వ్యవసాయ భూములున్న వారు మినహా సేదతీరేందుకు వెళ్లే నాథుడే లేడు. మొదటి ఏడాదిలో మొక్కల నిర్వహణ చూడగా, ప్రస్తుతం మొక్కలకు నీరు పోసే వారు లేక చనిపోయాయి. కొన్నిమొక్కలు దట్టంగా పెరిగిదారులు మూసుకుపోయాయి.



కొండమల్లేపల్లి మండలం కేశంనేని పల్లిలో ఎండిపోయిన మొక్కలు

● మిర్యాలగూడ మండలంలో ప్రకృతివనాలు చెత్తాచెదారులతో దర్శనమిస్తున్నాయి. కొత్తగూడెం, హట్యాతండాల్లోని ప్రకృతివనాలపై అధికారులు దృష్టిసారించకపోవడంతో రాళ్లగుట్టలు, నీళ్ల లేక వాడిపోయిన చెట్లతో అంధవిహీనంగా మారాయి. గ్రామపంచాయతీల్లో నిధుల కొరతతో వనాల సంరక్షణ భారంగా మారిందని అధికారులు పేర్కొంటున్నారు.

జూనియర్ సివిల్ జడ్జిలుగా పవన్, అరుణ్



పవన్‌కుమార్, అరుణ్‌తేజ్

మిర్యాలగూడ లీగల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా పీ పవన్‌కుమార్, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వియ్యపు అరుణ్‌తేజ్‌లను నియమిస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. సికింద్రాబాద్ జ్యుడీషియల్ అకాడమిలో పవన్‌కుమార్ పనిచేస్తుండగా, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వీ.అరుణ్‌తేజ్‌లు పనిచేస్తున్నారు. వీరిరువురూ బదిలీపై మిర్యాలగూడ కోర్టులకు రానున్నారు. జడ్జిలుగా నియమితులైన పవన్‌కుమార్ రెండు రోజుల్లో బాధ్యతలు చేపట్టనుండగా జ్యుడిషియల్ అకాడమిలో శిక్షణలో ఉన్న వీ అరుణ్‌తేజ్ జూన్ 26న విధుల్లో చేరనున్నారు. ఈ మేరకు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు కొంతకాలంగా జడ్జిలను నియమించకపోవడంతో ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా ఉన్న రెండు కోర్టులకు జడ్జిలను నియమించడంపై అటు కక్షిదారులు, ఇటు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జడ్జి సుమబాల బదిలీ

మిర్యాలగూడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి సుమబాల బదిలీపై ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా వెళ్లనున్నారు. సుమబాల స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో ఆ కోర్టు బాధ్యతలను తాత్కాలికంగా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జికి అప్పగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్లుగా సుమబాల మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు.

హుజూర్‌నగర్ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా ఆయేషా పర్విన్

హుజూర్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో నూతనంగా ప్రారంభించిన అదనపు జూనియర్ సివిల్ కోర్టు జడ్జిగా షేక్ ఆయేషా పర్విన్ శుక్రవారం నియమితులయ్యారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ ఉత్తర్వులు జారీ చేశారు. సత్తుపల్లిలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న ఆయేషా పర్విన్ సాధారణ బదిలీల్లో భాగంగా హుజూర్‌నగర్‌కు వచ్చారు. మొదటి సివిల్ జడ్జిగా మే 1వ తేదీ లోపు బాధ్యతలు స్వీకరించనున్నారు.

భక్తిభావంతో మంచిమార్గంలో నడవాలి



దివ్యబలి పూజలో ప్రసంగిస్తున్న విజయవాడ బిషప్ రాజారావు

మఠంపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ జాలి, దయ, కరుణ, భక్తిభావం కలిగి మంచిమార్గంలో నడవాలని సూర్యాపేట ప్రముఖ విచారణ గురువు, విజయవాడ బిషప్ రాజారావు అన్నారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల కేంద్రంలోని శుభవార్త దేవాలయం 29వ వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏసుప్రభు చూపిన మార్గంలో నడిచి పునీతులు కావాలన్నారు. సమాజంలో సేవా మార్గంలో నడవాలన్నారు. ప్రపంచానికి క్రీస్తు బోధనలే మార్గదర్శకమన్నారు. రాష్ట్రంలోని క్రైస్తవులకు, మఠంపల్లికి ప్రత్యేక ఉందన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం ఐదు గంటలకు ప్రత్యేకంగా అలంకరించిన రథంపై మరియమాతను పురవీధుల్లో క్రైస్తవులు ఊరేగించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, పంటలు సమృద్ధిగా పండాలని భజనలు చేస్తూ పాటలు పాడారు. అంతకుముందు సమష్టి దివ్యబలి పూజకార్యక్రమాన్ని విచారణ గురువులు, మార్టిన్ పసల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉత్సవాలకు తెలుగు రాష్ట్రాల నుంచేకాక దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు వారు తరలిరావడంతో మఠంపల్లిలో పండగ వాతావరణం నెలకొంది. శుభవార్త చర్చిలో గాదె సుజాత బృందం పాడిన పాటలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఫాదర్లు అల్లం బాలశౌరెడ్డి, తిరుమలరెడ్డి జోజిరెడ్డి, ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, ఆదూరి మధుసూదన్‌రెడ్డి, టీఆర్ రాజారెడ్డి, జయభారత్‌రెడ్డి, ఆదూరి శౌరెడ్డి, గాదె విక్టర్‌రెడ్డి, 30మంది విచారణ గురువులతో పాటు చర్చి కమిటీ పెద్దలు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు. శుభోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో భారీగా బాణాసంచా కాల్చుతూ ఆనందోత్సాహాల నడుమ వేడుకలను జరుపుకున్నారు.

నూతన వంగడాల రక్షణే లక్ష్యం

● క్షేత్రస్థాయిలో రైతులు, రైతు సంఘాలకు అవగాహన



కోదాడ రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నూతన వంగడాలకు రక్షణ హక్కులు ఉండాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈమేరకు మొక్కల రకాలు, రైతు హక్కుల రక్షణ చట్టాన్ని 2001లో రూపొందించింది. ఈ చట్టాన్ని అమలు చేయడానికి కేంద్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మొక్క రకాల రక్షణ, రైతు హక్కుల ప్రాధికార సంస్థను స్థాపించింది. ఈ చట్టం గురించి క్షేత్ర స్థాయిలో రైతులు, రైతు సంఘాలు, సామాజిక సంస్థలకు అవగాహన కల్పించడానికి జిల్లాలోని గడ్డిపల్లిలో శ్రీఅరబిందో కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కృషి చేస్తోంది. పంట రకాలను రూపొందించిన వారికి యాజమాన్య లాభాలు పొందే హక్కు ఈచట్టం వీలు కల్పించిందని శాస్త్రవేత్తలు తెలిపారు.

చట్టం ఏం చెబుతోందంటే..

● రైతులు తమ విత్తనాలను లేదా ప్రైవేట్ కంపెనీల విత్తనాలైనా దాచుకొని తిరిగి వినియోగించుకునే వీలు కల్పించారు. తమ పొలంలో పండించిన ఏ విత్తనాన్నైనా ఇతర రైతులతో మార్చుకోవచ్చు, విక్రయించవచ్చు.

● ఇతర రైతుల విత్తనాలు విక్రయించుకునే లేదా మార్చుకునే సమయంలో రకం, బ్రాండ్ పేరు గాని, సంస్థ పేరుతో ఉన్న సంచులను వినియోగించరాదు.

● దేశీయ, విదేశీయ విత్తనాభివృద్ధిలో విత్తనం మొలకెత్తే గుణాన్ని, అరికట్టే జన్యువుల వాడకాన్ని నిషేధించారు.

● రక్షణ పొందిన వంగడాలు మూడేళ్ల తర్వాత రైతుకు అందకపోతే రైతు హక్కుల ప్రాధికారిక సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు. ఈ ఫిర్యాదుని నిర్ధారించుకున్న తర్వాత తప్పనిసరి అనుమతి పత్రం ద్వారా ఆ కొత్త వంగడం మీద ఉన్న గుత్తాధిపత్యాన్ని రద్దుచేసి మరో సంస్థకు బదలాయించి సరైన ధర, సమయానికి కొత్త వంగడం రైతులకు అందజేసే వీలు ఈ చట్టం కల్పిస్తోంది.

కొత్త వంగడాలు

● శాస్త్రవేత్తవలే, రైతులు కొత్త వంగడాలను రూపొందించి నమోదు చేసుకునే వీలు కల్పించారు. దీనికి సంబంధించి రైతులకు ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదు.

● ఈ నమోదు గుర్తింపు పొందడానికి శాస్త్రవేత్తల వంగడాలకు వర్తించే పరీక్షలు, నియమ నిబంధనలే రైతులకు వర్తిస్తాయి.

పాత, సంప్రదాయ వంగడాలు

● రైతు సంఘాలు, సామాజిక సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలుగాని పాత లేదా రైతు సంప్రదాయ వంగడాలను మొక్క రకాల రక్షణ, రైతు హక్కుల ప్రాధికార సంస్థలో నమోదు చేసుకోవచ్చు.

● ప్రాధికార సంస్థలో నమోదైన రకాలను తామే స్వయంగా పండించి విత్తనాలుగా విక్రయించే హక్కు రైతులకు మాత్రమే ఉంది.

● ఈ నమోదుకు సంబంధించి ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

లాభంలో వాటా..

రైతు, రైతు సమూహాల వంగడాలను, కొత్త రకం అభివృద్ధి చేయడానికి ఎవరైనా వినియోగించినట్లు నమోదు అర్జీలో వ్యక్తపరిస్తే, ఈ కొత్త రకాల విక్రయం ద్వారా వచ్చే లాభంలో వాటా పొందే హక్కును చట్టం రైతులకు కల్పించిందిలాభంలో వాటా వంతును రైతు హక్కుల ప్రాధికార సంస్థ నిర్ధారిస్తుంది. సొమ్మును జాతీయ జన్యు నిధి సంస్థ నిబంధనలకు అనుగుణంగా పంపిణీ చేస్తుంది.

రాయితీలు, గుర్తింపులు

● రక్షణ పొందడానికి వాటికి అవసరమైన పరిస్థితులకు, రక్షణ కాలం అయిపోతే తిరిగి పొందడానికి, లాభాలు పొందేందుకు పెట్టుకునే అర్జీలు మొదలైన వాటికి సంబంధించి చెల్లించే రుసుము నుంచి రైతులను మినహాయించారు. అయినప్పటికీ వివాదాల సమయంలో చెల్లించే లాయర్ రుసుము, ఇతర ఖర్చులను రైతులే భరించాల్సి ఉంటుంది.

● చట్టాల గురించి తెలియక రైతులు ఏమైనా పొరపాట్లు చేసినట్లయితే, వాటిని అమాయకంగా తెలియక చేసిన తప్పులుగా రైతు నిరూపించుకోగలిగినట్లయితే కోర్టు వారు విధించే శిక్ష నుంచి రైతును మినహాయించే వీలు ఈ చట్టంలో పొందుపరిచారు.



కొనుగోలు కేంద్రాలకు ప్యాడీ క్లీనర్లు

● పౌరసరఫరాల శాఖ ద్వారా అందజేత ● జిల్లాలో ఐదు మార్కెట్లకు ఒక్కోటి చొప్పున ● ఈ నెల 24న వాటి పనితీరును పరిశీలించిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోత్కూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లోకి రెండేళ్ల క్రితమే ఆధునిక (ఆటోమెటిక్) ప్యాడీక్లీనర్లు అందుబాటులోకి వచ్చాయి. అయినా వ్యవసాయ మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాలం చెల్లిన (పాత) ప్యాడీ క్లీనర్లనే వినియోగిస్తున్నారు. పాత ప్యాడీ క్లీనర్లతో అవస్థలు పడలేక రైతులు ఆధునిక ప్యాడీ క్లీనర్లను అద్దెకు తీసుకొచ్చి ధాన్యం శుభ్రం చేస్తున్నారు. మార్కెట్లకు ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందించి రైతులకు అందుబాటులో ఉంచాలని, ప్రత్యేక కథనాలతో గత రెండేళ్లుగా 'ఆంధ్రజ్యోతి' చేసిన కృషి ఫలించింది. ఫలితంగా ఈ సంవత్సరం జిల్లాలో పౌరసరఫరాల శాఖ ప్రయోగాత్మకంగా ఐదు ఆధునిక ప్యాడీ క్లీనర్లు కొని వ్యవసాయ మార్కెట్లకు అందించింది. అవి బాగా పని చేస్తున్నాయి. దీంతో మరిన్ని ఆధునిక ప్యాడీ క్లీనర్లు కొనేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు

గత రెండేళ్లుగా ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి వచ్చినా ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పాత (కాలంచెల్లిన) ప్యాడీక్లీనర్లనే వాడారు. రైతులకు శ్రమ, సమయం, ఖర్చు ఎక్కువ అయ్యేది. దీంతో కొందరు రైతులు ఆధునిక ప్యాడీ క్లీనర్లను గంటకు రూ.వెయ్యి చొప్పున అద్దెకు తెచ్చుకుని ధాన్యం శుభ్రం చేసేవారు. ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులోకి వచ్చినా వ్యవసాయ మార్కెట్లలో ప్రభుత్వం పాత ప్యాడీ క్లీనర్లనే ఉంచడంతో రైతులు పడుతున్న అవస్థలను 'వృథాగా ప్యాడీ



మోత్కూరు మార్కెట్‌లో ఆధునిక ప్యాడీ క్లీనర్

క్లీనర్లు...' శీర్షికన 2023 ఏప్రిల్ 17న 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉండాలన్న రైతుల వాణిని వినిపించింది. కమీషన్ నిర్వాహకులకు... ఖర్చు రైతులకు, పాత పద్ధతుల్లోనే ప్యాడీ క్లీనింగ్, సాంకేతికత పెరిగినా... మారని తీరు, ఆధునిక ప్యాడీ క్లీనర్లు అద్దెకు తెచ్చుకుంటున్న రైతులు శీర్షికన 2024 ఏప్రిల్ 13న 'ఆంధ్రజ్యోతి' మరోసారి ప్రత్యేక కథనం ప్రచురించింది. రైతులకు ఆధునిక ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉంచాలన్న ఆలోచనను ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల్లో రేకెత్తించింది. దీంతో ఈ ఏడాది జిల్లాలో ప్రభుత్వం ప్రయోగాత్మకంగా ఐదు ఆధునిక ప్యాడీ క్లీనర్లు కొనుగోలు చేసి మోత్కూరు, ఆలేరు, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లకు ఒక్కోటి చొప్పున అందజేసింది. భువనగిరి ప్యాడీక్లీనర్ వేరే కేంద్రానికి పంపినట్లు చెబుతున్నారు. నాలుగు ప్యాడీ క్లీనర్లు బాగా పని చేస్తుండగా మోత్కూరు మార్కెట్‌లోని ప్యాడీ క్లీనర్‌లో ఒక స్ప్రింగ్ విరిగి ఇప్పటికి రెండుసార్లు మరమ్మతు చేసి పైపు ద్వారా ధాన్యం తీసుకోవడం లేదని చెబుతున్నారు. ధాన్యం ఎత్తి అందులో పోస్తూ నడుపుతున్నారు.

ప్యాడీ క్లీనర్ పని తీరును పరిశీలించిన అదనపు కలెక్టర్

ఈ నెల 24న మోత్కూరు వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించిన అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధునాతన ప్యాడీ క్లీనర్ పనితీరును పరిశీలించారు. రైతులను దాని గురించి అడిగి తెలుసుకున్నారు. ప్యాడీ క్లీనర్ సరఫరా చేసిన డీలర్‌తో మాట్లాడారు. సీజన్ తర్వాత దాన్ని మరమ్మతు చేసి ఇస్తానని చెప్పినట్లు తెలిసింది. ఆధునిక ప్యాడీ క్లీనర్ల పనితీరు బాగుండటంతో మరికొన్ని ప్యాడీ క్లీనర్లు కొని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వ యంత్రాంగం యోచిస్తున్నట్లు సమాచారం.

ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రంలో..

పాత ప్యాడీ క్లీనర్లు పక్కనబెట్టి ప్రతీ ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఒక ఆధునిక ప్యాడీ క్లీనరు అందించాలని రైతులు కోరుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ప్రభుత్వం కమీషన్ ఇస్తున్నందున, ప్రభుత్వం ప్యాడీ క్లీనర్ల కొనుగోలులో వారిని భాగస్వామ్యంచేసి అయినా సరే తక్కువ ధాన్యం వచ్చే కేంద్రానికి ఒక్కటి, ఎక్కువ ధాన్యం వచ్చేకేంద్రాలకు రెండు, మూడు చొప్పున ప్రభుత్వం ప్యాడీ క్లీనర్లు అందించాలని రైతులు కోరుతున్నారు.



వలిగొండ మండలంలో తూర్పారబడుతున్న ధాన్యం

కొను'ఘొల్లు'!

(5వ పేజీ తరువాయి)

కేంద్రాల వద్ద ధాన్యం భారీగా నిల్వ ఉంటోంది. దీంతో కాంటాలు వేయకుండా జాప్యం చేస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. ప్రధానంగా జిల్లాలో ఆయకట్టు ప్రాంతంలో ఈ సమస్య అధికంగా ఉంది. ఇదే అదనుగా హమాలీలు సైతం కాంటాలకు అదనపు రుసుము డిమాండ్ చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. అకాలవర్షాలు, గాలిదుమారాలతో ధాన్యం కాపాడుకోవడం ఇబ్బందికరంగా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని కాంటాలు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. మిల్లుల్లో ధాన్యం దిగుమతి చేసుకునే పరిస్థితి లేకపోతే గోదాములకు తరలించాలని కోరుతున్నారు.

యాదాద్రి జిల్లాలో ఇప్పుడిప్పుడే ప్రారంభమైన తాకిడి

యాదాద్రి జిల్లాలో ఇప్పుడిప్పుడే వరికోతలు పూర్తికావస్తున్నాయి. కల్లాల్లో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు ఇప్పుడిప్పుడే కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తున్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో కనీసం 3లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించి 297 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో సన్నధాన్యం దిగుబడి అతి స్వల్పంగా 20వేల మెట్రిక్‌టన్నులకు లోబడే ఉంటుందని, కొనుగోలు కేంద్రాలకు సన్నధాన్యం రాదని అంచనావేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం 14వేల మెట్రిక్‌టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. జిల్లాలో మరో నెలరోజులపాటు ధాన్యం కొనుగోళ్లు జరపాల్సి ఉంటుందనే అంచనాతో కేంద్రాల నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. రైతులకు టోకెన్లు ఇస్తూ కొనుగోళ్లలో ఇబ్బందుల్లేకుండా చూస్తామని పౌరసరఫరాలశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

బతిమిలాడితేనే మిల్లర్ల కొనుగోలు

మిర్యాలగూడ డివిజన్‌లోని రైస్‌మిల్లుల వద్ద ఉమ్మడి జిల్లా రైతులు తీసుకువచ్చే ధాన్యానికి సరైన ధర దక్కడం లేదు. ప్రధానంగా మిల్‌పాయింట్ల వద్దకు రాష్ట్రంలోని నిజామాబాద్, ఖమ్మం, పాలమూరు జిల్లాలతో పాటు పొరుగున ఉన్న ఏపీ రాష్ట్రంలోని పల్నాడు, కృష్ణాజిల్లాల నుంచి ధాన్యం భారీగా వస్తోంది. నాణ్యత ఉండడంతో పాటు, మిల్‌పాయింట్ల వద్దకు వచ్చి మరీ డెలివరీ ఇస్తుండడం, ధర క్వింటాకు రూ.2,300కు లోబడే తీసుకుంటుండటంతో మిల్లర్లు ఈ ధాన్యం కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో స్థానిక ఉమ్మడి జిల్లా రైతులు తీసుకువస్తున్న సన్నధాన్యానికి ధర దక్కడం లేదు. సీజన్ ఆరంభంలో మిల్‌పాయింట్ల వద్ద క్వింటాకు రూ.2,700 వరకు ధర ఇచ్చారని, ఇప్పుడు నాణ్యత లేదని, తాలు ఎక్కువగా వస్తోందని సాకులు చెబుతూ కనీస మద్దతు ధరకే పరిమితం చేస్తున్నారని, అదికూడా కొనుగోలు చేసేది లేదని మొండికేస్తూ, బతిమాలించుకుని కొనుగోళ్లు చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మిల్లుల వద్ద గిట్టుబాటు ధర ఇవ్వడం లేదు



బోరుకింద ఐదెకరాల్లో చింట్లు రకం సన్న ధాన్యం సాగుచేశా. సుమారు 150 క్వింటాళ్ల ధాన్యం మూడు ట్రాక్టర్లలో తీసుకువచ్చాం. మిల్లర్లు కొనుగోలు చేయకపోవడంతో మిల్లు, మిల్లు తిరిగి బతిమలాడా. చివరికి ఓ మిల్లర్ రూ.2,370 ధర చెల్లించి కొనుగోలు చేశాడు. సీజన్ ఆరంభంలో ఇదే రకం ధాన్యానికి రూ.2,700 వరకు చెల్లించారు. ప్రస్తుతం ధర తగ్గించినా, తప్పనిపరిస్థితిలో విక్రయించి వెళ్తున్నాం. మద్దతు ధర ఇస్తున్నారు కాబట్టి మిల్లర్లపై ఎక్కువ ధర విషయంలో ఒత్తిడి చేయలేమని అధికారులు చెప్పి తప్పించుకుంటున్నారు.

టీ.సత్తిరెడ్డి, అంతయ్యగూడెం, నల్లగొండ జిల్లా

బతిమాలితే తప్ప కొనడం లేదు



ఎకరం పొలంలో చింట్లు రకం సాగు చేశా. 33 క్వింటాళ్ల దిగుబడి రాగా, మిల్లు వద్దకు తీసుకువచ్చాం. నాణ్యతలేదని ధర తగ్గించారు. చివరికి బతిమిలాడితే క్వింటాకు రూ.2,270 ధర చెల్లించారు. ఇదే రకం ధాన్యాన్ని సీజన్ ప్రారంభంలో తెచ్చినవారికి రూ.2,600 వరకు ఇచ్చారు. ఇప్పుడు ఏపీ రాష్ట్రం నుంచి తక్కువ ధరకు ధాన్యం వస్తుండటంతో మా ధాన్యం కొనుగోలు చేయడం లేదు. అధికారులు చూస్తున్నారే తప్ప రైతులకు మేలు చేసే పనులు చేయడం లేదు.

ఇసుబ్, గోగువారిగూడెం, నల్లగొండ జిల్లా

10రోజులైనా కాంటాలు వేయలేదు



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి 10 రోజులవుతున్నా కాంటాలు వేయడం లేదు. లారీలు రావడం లేదని కొన్ని రోజులు, తేమశాతం ఎక్కువగా ఉందని మరి కొన్ని రోజులు కాంటాలు వేయకుండా గడుపుతున్నారు. మిల్లుల వద్ద హమాలీలు బస్తాకు రూ.8 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. వాన, గాలితో ఇబ్బందిపడుతున్నాం. సుమారు 112 బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రానికి తెచ్చా. తక్షణమే ప్రభుత్వం కేంద్రాల నిర్వహణపై దృష్టిసారించి, వెంటనే కాంటాలు వేసేలా చర్యలు తీసుకోవాలి.

అవిరే అప్పయ్య, ఆత్మకూరు(ఎస్), సూర్యాపేట జిల్లా

కేంద్రానికి వచ్చి 15 రోజులైంది



నేను సుమారు 25 బస్తాల ధాన్యాన్ని దుప్పలపల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి 15 రోజులు అవుతోంది. ధాన్యం పచ్చిగా ఉందని, లారీలు రావడం లేదని కాంటాలు వేయడం లేదు. ధాన్యం బాగా వస్తుండడంతో సీరియల్ ప్రకారం కాంటాలు వేస్తున్నారు. దీంతో జాప్యమవుతోంది. వర్షం వస్తే ధాన్యం తడుస్తుందని భయమవుతోంది. వేగంగా కాంటాలు వేసి కొనుగోలు చేయాలి.

ఖైరగోని అనూరాధ, రాయినిగూడెం, నల్లగొండ జిల్లా

అనారోగ్యంతో యువకుడి మృతి

● ఆర్ఎంపీ నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ
● ఐదు గంటల పాటు మృత దేహంతో ధర్నా

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో స్థానిక ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లిన యువకుడు చికిత్స అందిస్తున్న క్రమంలో మృతిచెందాడు. వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని బంధువులు, కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో శుక్రవారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన అన్నారం శివశంకర్ (26) స్థానిక సంస్కృత పాఠశాల సమీపంలో సెలూన్ దుకాణం నడుపుతూ కుటుంబాన్ని పోషించుకున్నాడు. శుక్రవారం ఉదయం 6గంటల సమయంలో కడుపు నొప్పి, విరోచనాలు కావడంతో ఆర్ఎంపీ ప్రైవేట్ నర్సింగ్‌హోమ్‌కు వెళ్లాడు. స్థానిక ఆర్ఎంపీ ఉపేందర్ కడుపు నొప్పి, విరోచనాలు తగ్గడానికి ప్రథమ చికిత్స చేశారు. కొంత సేపటికే ఆకస్మికంగా నేలపై పడిపోయాడు. ఛాతిలో విపరీతమైన నొప్పి రావడంతో ఆకస్మికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. దీంతో యువకుడికి గుండెపోటు అని ఆలస్యంగా పసిగట్టిన వైద్యుడు మెరుగైన వైద్యంకోసం హుటాహుటిన భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించాలని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన వారు వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్‌చేయగా స్థానిక అంబులెన్స్ లేకపోవడంతో భువనగిరి నుంచి ఆవడంతో 30 నిమిషాల పాటు ఆలస్యమైంది. వెంటనే అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించగా వైద్యులు ఈసీజీ పరీక్షలు నిర్వహించి అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించినట్లు తెలిసింది.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మృతదేహంతో ఆసుపత్రిలో ఆందోళన

అన్నారం శివశంకర్ మృతికి ఆర్ఎంపీ వైద్యుడు నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ బంధువులు, కుటుంబ సభ్యులతో కలిసి 5గంటల పాటు ఆందోళన కొనసాగించారు. ఒక్కగానొక్కడు ఇంటికి పెద్దదిక్కు శివశంకర్ మృతి చెందడంతో కుటుంబం ప్రశ్నార్థకంగా మారిందని తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరుతూ ఆసుపత్రిలోనే భీష్మించారు. దీంతో సమాచారం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఆసుపత్రి వద్దకు వెళ్లి పరిస్థితిని చక్కదిద్దుతూ వైద్యుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

గుండెపోటుతోనే మృతి: ఆర్ఎంపీ శివశంకర్

ఉదయం 6-30 గంటల ప్రాంతంలో కడుపునొప్పి అంటూ ఛాతీలో బరువుగా ఉందని వచ్చాడని ఆర్ఎంపీ శివశంకర్ తెలిపారు. వెంటనే కడుపునొప్పికి సంబంధించిన గ్లూకోజ్ ఇంజెక్షన్‌తో ప్రథమ చికిత్స నిర్వహించానని దాంతో కొంతవరకు నొప్పితగ్గిందని తెలిపాడని పేర్కొన్నారు. వెంటనే ఛాతిలో నొప్పి అంటూ తీవ్రంగా ఇబ్బంది పడటం గమనించానని గుండెనొప్పి ఉందని 20 నిమిషాలు ఆలస్యంగా గుర్తించాని వెంటనే మెరుగైన వైద్యం కోసం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించాలని కుటుంబ సభ్యులకు తెలిపానని చెప్పాడు. అంబులెన్స్ ఆలస్యంగా రావడంతో ఇలా జరిగిందని, తాను కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేశానని తన తప్పు ఏమి లేదని వైద్యుడు ఉపేందర్ వివరణ ఇచ్చారు.

కేసు విచారణ జరుపుతున్నాం: ఎస్ఐ ఉదయ్‌కుమార్

శివశంకర్ ఉదయం కడుపునొప్పి, విరోచనాలుతో బాధపడుతుండగా వైద్యం కోసం ప్రశాంత్ నర్సింగ్‌హోంకు తీసుకెళ్లామని, అక్కడ వైద్యుడు ప్రథమ చికిత్స చేసినప్పటికీ తగ్గకపోగా పరిస్థితి విషమించడంతో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు శివశంకర్ భార్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు విచారణ జరిపి కేసునమోదు చేశామని మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. కాగా బాధిత కుటుంబానికి వైద్యుడు నష్టపరిహారం ఇస్తానని పెద్దల సమక్షంలో ఒప్పుకోవడంతో ఆందోళన ఉపసంహరించినట్లు తెలిసింది.

లక్ష్మీఅమ్మవారికి వైభవంగా ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట రూరల్, ఏప్రిల్, 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్యక్షేత్రంలో శుక్రవారం శ్రీస్వామి వారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయంలోని స్వయంభువులను సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీ దళాలు , కుంకుమతో అర్చించారు. ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య కళ్యాణ పర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన అండాల్ అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. పాతగుట్ట ఆలయంలో నిత్యపూజలు సంప్రదా రీతిలో కొనసాగాయి. కొండపైన అనుబంధ శివాలయంలో శ్రీపర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం, శైవగమ పద్ధతిలో కొనసాగాయి.. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వార రూ. 19, 97,923 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఏ బాస్కర్‌రావు తెలిపారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న అర్చకులు

నాణ్యమైన విద్యను అందిస్తున్న బడ్జెట్ స్కూల్స్

భువనగిరి టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్ స్కూల్స్ సౌకర్యవంతమైన ఫీజులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బడ్జెట్ స్కూల్స్ యాజమాన్యాల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం భువనగిరిలో జరిగిన అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. ఫీజులు తక్కువగా తీసుకుంటూనే కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా విద్యాబోధన, ల్యాబ్‌లు, అర్హతగతల ఉపాధ్యాయుల నియామకం తదితర వసతులను కల్పిస్తున్నాయని అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాలలో మార్కుల విధానం బదులు ప్రస్తుత గ్రేడింగ్ విధానాన్నే కొనసాగించాలని ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డి, చూపాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బడ్జెట్ స్కూల్ ఉపాధ్యాయులందరికీ యాజమాన్యాలు బీమా వర్తింప చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడాల జలేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, ఇల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం దుర్గప్రసాద్, చిట్టిబాబు, ప్రభాకర్‌రెడ్డి, బసవరెడ్డి, కోణార్క్‌రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

గూడ్స్‌రైలు బోగీలో పొగలు

● *యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరులో ఘటన*
● *సకాలంలో స్పందించిన సిబ్బంది..*

ఆలేరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు రైల్వే స్టేషన్‌మాస్టర్ అప్రమత్తతతో గూడ్స్‌రైలుకు అగ్నిప్రమాదం తప్పింది. కాజీపేట నుంచి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న గూడ్స్ రైలు బొగ్గు బోగీలో శుక్రవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో ఆలేరు రైల్వే స్టేషన్ పరిధిలో పొగలు వ్యాపించడాన్ని ఆలేరు రైల్వే స్టేషన్ మాస్టర్ గమనించారు. వెంటనే రైలు ఇంజన్ డ్రైవర్‌కు సమాచారం అందించి రైలును నిలిపివేయించారు. వెంటనే స్థానికంగా ఉన్న అగ్నిమాపక సిబ్బంది రైల్వే స్టేషన్‌కు చేరుకుని బోగీలో ఏర్పడ్డ దట్టమైన పొగలను నీటితో చల్లార్చారు. బోగీలో ఎలాంటి పొగలు లేకుండా చల్లార్చిన అనంతరం గూడ్స్ రైలు సికింద్రాబాద్‌కు బయలుదేరింది. పొగలు అదుపులోకి తేవడానికి కృషి చేసిన ఫైర్‌ఇంజన్ ఇన్‌చార్జి ఎస్ఎఫ్‌వో కె.డాక్టర్ బాబు, సిబ్బంది మల్లేశ్, ఎ.వెంకటేశ్, ఎన్.కరుణాకర్‌లను పలువురు ప్రశంసించారు.

దోస్తులంతా కలిసి దొంగతనాలకు

● *రూ.9.60లక్షల విలువైన 24 మోటార్లు స్వాధీనం*
● *నిందితులంతా ఒకే గ్రామానికి చెందిన వారు*

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): దోస్తులంతా కలిసి దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి సుమారు రూ.9.60 లక్షల విలువైన 24 మోటార్లను స్వాధీనం చేసుకుని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి నల్లగొండ డీఎస్పీ కే.శివరాంరెడ్డి శుక్రవారం నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి అనంతరం నార్కట్‌పల్లి సీఐ, ఎస్ఐలు నాగరాజు, క్రాంతికుమార్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీ వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని శాపల్లి గ్రామానికే చెందిన మాగి నాగరాజు, సుద్దాల నర్సింహ, బకరం శేఖర్, భాషపాక సైదులు, నల్లమాద లింగయ్య, భాషపాక లింగయ్య స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరంతా సులభంగా సంపాదించే దురాశతో గత కొన్నేళ్లుగా వ్యవసాయ బావుల వద్ద ఉన్న మోటార్లను చోరీ చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ నెల 9న వీరంతా కలిసి శాపల్లి గ్రామ శివారులోని కన్నెబోయిన శ్రీను వ్యవసాయ బావి వద్ద ఉన్న బోరు మోటారును చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు దర్యాప్తు జరుపుతున్నామని డీఎస్పీ తెలిపారు. కాగా ఈ నెల 25న ఉదయం నార్కట్‌పల్లిలోని అమ్మనబోలు రోడ్డు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న మాగి నాగరాజును అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా తనతోపాటు గ్రామానికి చెందిన మిగతా ఐదుగురు స్నేహితులతో కలిసి కన్నెబోయిన శ్రీనివాస్‌తోపాటు శాపల్లి, నక్కలపల్లి, తొండ్లాయి, కట్టంగూర్ మండలంలోని నారెగూడెం, ఈదులూరు, మరికొంతమంది రైతుల పొలాల వద్ద ఉన్న బోరు మోటార్లను గత నాలుగేళ్లుగా చోరీ చేసి విక్రయించినట్లు నేరాన్ని అంగీకరించారు. వీరినుంచి రూ.9.60లక్షల విలువైన మోటార్లు, రెండు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. నిందితులందరినీ నల్లగొండ కోర్టుకు రిమాండ్‌కు తరలిస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. కాగా ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన సీఐ, ఎస్ఐలతో పాటు హెడ్‌కానిస్టేబుల్ రాము, పీసీలు గిరిబాబు, సత్యనారాయణ, శివశంకర్, తిరుమల్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించినట్లు శివరాంరెడ్డి తెలిపారు.

నేడు కాశీవిశ్వేశ్వరస్వామి కల్యాణం

నల్లగొండ కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మాస శివరాత్రిని పురస్కరించుకొని నల్లగొండ పట్టణంలోని తులసీనగర్‌లో గల భక్తాంజనేయస్వామి శివాలయంలో విశాలాక్షి సహిత కాశీ విశ్వేశ్వరస్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కుశలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26వ తేదీ ఉదయం నుంచి స్వామివారికి రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్లు, రాత్రి 7గంటలకు కల్యాణాన్ని జరిపించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్య పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇంటర్ ర్యాంకర్ యాస తీక్షకు అభినందనలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో 994 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ర్యాంకర్‌గా నిలిచిన నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన విద్యార్థిని యాస తీక్షను కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బత్తుల ఊశయ్య అభినందించారు. విద్యార్థిని తీక్ష విద్యాభ్యాసానికి ఫీజు కోసం రూ.120 లక్షలను గతేడాది మంత్రి వెంకట్‌రెడ్డి అందజేసిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పాశం శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు భరత్‌గౌడ్, నాయకులు రాంరెడ్డి, సత్తయ్య పాల్గొన్నారు.

వరంగల్ సభను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య

నల్లగొండ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ బహిరంగ సభ ఒక పండుగలాగా జరగనుందని ఈ సభకు నల్లగొండ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఎంతో సంతోషంగా ఉండేవారని, ఈ ఏడాదిన్నర పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రుణమాఫీ పూర్తి చేయలేదని, రైతుభరోసా పేరిట కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందన్నారు. ఈ నెల 27న జరిగే భారీ బహిరంగ సభలో మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చే సందేశం కోసం ప్రజలంతా ఎదురు చూస్తున్నారని అన్నారు. అనంతరం పట్టణంలోని క్లాక్‌టవర్‌లో జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల తూటాలకు అసువులు బాసిన వారికి నల్లబ్యాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నాయకులు అభిమన్యు శ్రీనివాస్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, మారగోని గణేష్, జమాల్ ఖాద్రీ, జాఫర్ పాల్గొన్నారు.


నల్లగొండ జిల్లా కేంద్రంలో ద్విచక్ర వాహన ర్యాలీలో పాల్గొన్న భూపాల్‌రెడ్డి

హామీలు అమలుచేయని ప్రభుత్వం

కేతేపల్లి: ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా వ్యతిరేకతకు భయపడి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడంలేదని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చి హామీలన్నీ బోగస్ అని ప్రజలకు తెలిసిపోయిందన్నారు. రజతోత్సవ సభ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు రావడం ఖాయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎం.వెంకట్‌రెడ్డి, నాయకులు కె.ప్రదీప్‌రెడ్డి, బంటు మహేందర్, సైదులు గౌడ్, వేణుమాధవరెడ్డి, జి.సత్యనారాయణ, సైదులు తదితరులు పాల్గొన్నారు.


కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

● చిట్యాల బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ యువజన విభాగం మండల అధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఇచ్చిన 420 హామీలను అమలుచేయకుండా మోసం చేస్తుందని విమర్శించారు.

● నార్కట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లో చెర్వుగట్టు దేవస్థానం మాజీ చైర్మన్ మేకల రాజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు కొండూరు శంకరయ్య, శ్రీనివాస్, లింగయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

● శాలిగౌరారంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఐతగోని వెంకన్నగౌడ్ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరిగిందని, పార్టీ ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమం మాజీ ఎంపీటీసీ వలిశెట్టి చంద్రకళ దశరథ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కట్టంగూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్మాయిల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్, సీపీఎంలకు చెందిన 20 కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ సర్పంచ్ అంజయ్య, రెడ్డిపల్లి వీరస్వామి, సైదులు పాల్గొన్నారు.

హెచ్ఆర్‌సీని కలిసిన జియావుద్దీన్

కనగల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల సంఘం రాష్ట్ర చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ శుక్రవారం నల్లగొండ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బీ అతిథిగృహంలో కాంగ్రెస్ నాయకుడు, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ జియావుద్దీన్ ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు.

సద్వినియోగం చేసుకోవాలి

తిప్పర్తి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యాంకు సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సహకార బ్యాంకుల్లో రుణాలతో పాటు, గోల్డ్‌లోన్లు ఇస్తున్నట్లు తెలిపారు.

పేదలకు నాణ్యమైన విద్యకోసమే ఉద్దీపన


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్‌చంద్రపవార్, ఎమ్మెల్యేలు వీరేశం, బీఎల్ఆర్

నకిరేకల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసమే ఉద్దీపన ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని జడ్పీ హైస్కూల్‌లో ఉద్దీపన ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీవీఎం పాఠశాల మొదటి వార్షికోత్సవానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్దీపన ప్రైవేట్ స్కూళ్లకు వ్యతిరేకం కాదని అన్నారు. 2014లో నకిరేకల్ నియోజకవర్గ వ్యాప్తంగా 100కు పైగా పాఠశాలలు ఏర్పాటు చేసి 110మంది వలంటరీ టీచర్లతో ఇంగ్లీష్ మీడియం బోధన చేయించినట్లు తెలిపారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిర్యాలగూడ ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయస్సు నుంచే లక్ష్యాన్ని ఎంచుకుని కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కందాళ పాపిరెడ్డి, మునిసిపల్ చైర్ పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ గుత్తా మంజుల మాధవరెడ్డి, ఉద్దీపన గౌరవ సలహాదారుడు ఆనంద్, హెచ్ఎం భద్రయ్య, సీహెచ్ సతీష్ పాల్గొన్నారు. మునిసిపల్ కౌన్సిలర్ మట్టిపల్లి కవిత వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థులందరికీ ఉచితంగా దుస్తువులు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

నిరుపేద ఎస్సీలకు అండగా సేవా కార్యక్రమాలు


సమావేశంలో మాట్లాడుతున్న పెరిక కరణ్‌జయరాజ్

నల్లగొండటౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ఎస్సీలకు అండగా నిలిచేందుకు డాక్టర్ అంబేద్కర్, జగ్జీవన్ రామ్ సేవా సంఘం, మాదిగ సంఘాల జేఏసీలు సంయుక్తంగా సేవా కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల జగన్‌కుమార్, రాష్ట్ర కన్వీనర్ పెరిక కరణ్‌జయరాజ్ తెలిపారు. పట్టణంలోని టీఎన్జీవో భవనంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశ్మీర్‌లో ఉగ్రవాదుల జరిపిన మారణకాండను ఖండిస్తూ అమరులైన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ నిరుపేద కుటుంబాలకు చెందిన వారు అకాల మృతిచెందితే దహన సంస్కారాల కార్యక్రమాల నిమిత్తం వారికి కుటుంబాలకు ఆర్థిక సహాయం, కార్యక్రమం అనంతరం భోజన వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఆర్థిక, రాజకీయ, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి కూడా సంఘం పాటుపడతుందని అన్నారు. విద్య, వైద్య, ఉపాధి విషయాలలో సంఘం ఆధ్వర్యంలో తగిన సహాయ సహకారాలు అందించనున్నట్లు తెలిపారు. సమావేశం అనంతరం నూతన జిల్లా మండల, పట్టణ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా పర్యటనకు వచ్చిన మానవహక్కుల కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ వర్గీకరణను అన్ని వర్గాల ప్రజలు మెచ్చే విధంగా చేసి ప్రభుత్వానికి నివేదికను అందజేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కత్తుల సంజీవ, పెరిక సంహితరాణి, పెరిక ఉమామహేశ్వరరావు, జి.జైపాల్, కత్తుల రాంబాబు, షణ్ముఖ కుమార్, రూప, శివరామకృష్ణ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


కేటీఆర్‌ను కలిసిన నకిరేకల్ నియోజకవర్గ నేతలు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పార్టీ నియోజకవర్గ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో ఈనెల 27వ తేదీన నిర్వహించే సభకు నకిరేకల్ నియోజకవర్గం నుంచి కార్యకర్తలను అధికసంఖ్యలో సమీకరించి వారు క్షేమంగా ఇంటికి చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో నల్లగొండ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, నలగాటి ప్రసన్నరాజ్, నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, కట్టంగూర్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ నూక సైదులు, నాయకులు ఉట్కూరి ఏడుకొండలు, ఎల్లపురెడ్డి సైదిరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

శాలిగౌరారం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం అడ్లూర్ గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన చింతల లింగమ్మకు, ప్రమాదంలో గాయపడి చనిపోయిన నిమ్మనగోటి సతీష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ పేద కుటుంబాలకు అండగా ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోడ సునీల్‌మాదిగ, బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కట్ట వెంకట్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు బట్ట శ్రీనివాస్, కారుపాటి అంబేడ్కర్, మాజీ సర్పంచ్ బోడ నర్సయ్య, డొనకొండ అంజయ్య, దాసరి ఐలయ్య, కొప్పు యల్లయ్య, ఉప్పలయ్య, సైదులు, వెంకన్న పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

శాలిగౌరారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మౌలిక వసతుల కల్పించి గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృష చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామంలో శుక్రవారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించి మాట్లాడారు. పార్టీలో చురుకుగా పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గైగుల్ల అవిలయ్య, నాయకులు నాగరాజు, అల్లి సైదులు, రామచంద్రం, శ్రీనివాస్, వసంతరావు, శ్రవణ్, అనిల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులే బాధ్యులు


కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ విష్ణుమూర్తి

కనగల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రహదారులపై మైనర్లు వాహనాలు నడుపు తూ పట్టుబడితే తల్లిదండ్రులే బాధ్యులవుతారని, వారిపై మోటార్ వాహనాల చ ట్టం కింద కేసులు సైతం నమోదు చేస్తామని ఎస్ఐ విష్ణుమూర్తి హెచ్చరించారు. మైనర్ల ర్యాష్ డ్రైవింగ్‌పై పోలీసులు శుక్రవారం కనగల్ ఎక్స్‌రోడ్డులో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా 16 మంది బాలలు వాహనాలు నడుపుతూ ప ట్టుబడ్డారు. దీంతో వాహనాలను సీజ్ చేసి వారిని స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. తల్లిదండ్రులను, వాహనాల ఓనర్లను స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. మైనర్ల డ్రైవింగ్ కారణంగా వారితో పాటు ఎదురుగా వచ్చే వాహనదారులు సైతం ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పీసీలు వెంకన్న, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై దాడి పిరికిపంద చర్య

నల్లగొండటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల జరిపిన దాడి పిరికిపంద చర్య అని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రజీయుద్దీన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని తాలుక్‌దారి మజీదులో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పహ ల్గాంలో జరిగిన మారణహోమాన్ని ముక్తకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకులపై దాడి పిరికిపంద చర్యగా అభివర్ణించారు. కార్యక్రమంలో మజీదు కమిటీ అధ్యక్షుడు రియాజుద్దీన్, ఫౌజ్ మొహమ్మద్, హాషం భాయ్, మూదసిర్ మొహసినీన్, రిజ్వాన్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి : మసీదు వద్ద జమాతే ఉమ్లా ఆధ్వర్యంలో ముసిల నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జమాతే ఉమ్లా ప్రతినిధి ముఫ్తీ జుబేర్ సాబ్ ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. కశ్మీర్‌లో పర్యటనకు వెళ్లిన హిందు సందర్శకులపై కాల్పులు జరిపి ప్రాణాలు తీయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. భారతీయులు ఏకమై ఉగ్రదాడులను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హఫీజ్ ముతీన్, మహ్మద్ సర్వర్ అలీ, మన్సూర్ ఖాన్, యాసీన్ ఖాన్, ఆసిఫ్, యూసుఫ్, కరీం, అహ్మద్‌పటేల్, రహీం, ఫైసల్, షమీమ్ పాల్గొన్నారు. అలాగే ఉగ్రవాదుల మారణకాండకు నిరసనగా నార్కట్‌పల్లిలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఉగ్రవాదుల కాల్పుల్లో వీరమరణం పొందిన వారి కి సంతాపం తెలిపారు.పార్టీలకతీతంగా యువకులు పాల్గొన్నారు.


నల్లగొండలో ఉగ్రవాద దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు

● రామగిరి: విశ్వహిందు పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో గడియారం సెంటర్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకముందు రామాలయం నుంచి గడియారం సెంటర్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు జూకూరి సంపత్ వర్మ, పచ్చల వంశీ, రాయల కృష్ణ, నరసింహ ఉన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

చిట్యాలరూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని బీజేపీ జిల్లా నాయకుడు చికిలంమెట్ల అశోక్ డిమాండ్ చేశారు. మండలంలోని ఉరుమడ్లలో శుక్రవారం ఉపాధి పనులను ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడారు. మూడు నెలలుగా కూలి డబ్బులు పెండింగ్‌లో ఉండటం వల్ల ఇబ్బందుల పడుతున్నామని అన్నారు. వెంటనే బకాయి వేతనాలను చెల్లించాలని, అదేవిధంగా పని చేసే చోట వసతులు కల్పించాలని, పనిముట్లు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఘనంగా నాయకుడు కిరణ్‌కుమార్ జన్మదిన వేడుకలు


కాంగ్రెస్ నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న నూక కిరణ్‌కుమార్ యాదవ్

శాలిగౌరారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు, అధికార ప్రతినిధి నూక కిరణ్‌యాదవ్ జన్మదిన వేడుకలను మండలంలోని పెర్కకొండారం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నిర్వహించిన వేడుకల్లో నాయకులు కేట్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కిరణ్‌కుమార్‌తో కేక్ కట్ చేయించి ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో నిర్వహించుకోవాలని, రాష్ట్ర రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని తెలిపారు.

అదనపు కలెక్టర్ రాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు


రాజ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న అధికారులు

నల్లగొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పి.రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శుక్రవారం పలువురు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కుంభం నర్సిరెడ్డి, ఉద్యానశాఖ అధికారి అనంతరెడ్డి, బ్యాడ్మింటన్ కోచ్ ప్రకాశ్ నారాయణ తదితరులు రాజ్‌కుమార్‌ను కలిసి శాలువాతో సన్మానించి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అమరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వీరారెడ్డి

గట్టుప్పల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గట్టుప్పల్ మండల కేంద్రంలోని ఈనెల 30న నిర్వహించే అమరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తోందని విమర్శించారు. జిల్లాలో పలుచోట్ల భూ సమస్యలు ఉన్నాయని, గత పదేళ్లగా ఏ ఒక్కరికి ఇంటి స్థలాలు ఇవ్వలేదన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను కార్మిలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న మునుగోడు ప్రాంత సీపీఎం నాయకులు కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో అగ్రభాగాన నిలిచి అమరులయ్యారన్నారు. ఈ నెల 30న మండల కేంద్రంలో నిర్వహించే అమరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి కట్ల నరసింహ, నాయకులు కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, బొట్టు శివకుమార్, కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, ఖమ్మం రాములు, టేకుమెట్ల కృష్ణ, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీసీలకు చట్టసభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని మన ఆలోచన సాధన సమితి రాష్ట్ర నాయకులు చుక్కల సత్యనారాయణ, గునిగంటి చంద్రశేఖర్ గౌడ్‌లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీసీ కులా సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీలలో చైతన్యం తీసుకురావడానికి మన ఆలోచన సాధన సమితి పేరుతో ఈ ఏడాది ఏప్రిల్ 15న తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ ఆవిర్భావిందని ఈ సమితికి కటకం నర్సింగ్‌రావు వ్యవస్థాపక అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. మన ఆలోచన సాధన సమితిని తెలంగాణలో విస్తరించేందుకు గ్రామ, గ్రామాన బీసీలను చైతన్యం తీసుకురావడానికి కృషి చేస్తున్నామని, అందులో భాగంగా మొట్టమొదటిసారిగా శాలిగౌరారం మండలంలో బీసీ నాయకులతో సమావేశమైనట్లు తెలిపారు. తాము చేసే ఉద్యమానికి బడుగు , బలహీన వర్గాల ప్రజలు, బీసీ నాయకులు పార్టీలకతీతంగా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు పాశం సత్యనారాయణ, గూడ చెన్నయ్య, ముద్రబోయిన లచ్చయ్య యాదగిరి గౌడ్, శాలిగౌరారం మండల బీసీ సంఘాల నాయకులు నిమ్మల కృష్ణమూర్తి, నల్ల చక్రపాణి, భూపతి సత్యనారాయణ, వీరయ్య పాల్గొన్నారు..

మరణంలోనూ వీడని స్నేహబంధం

మునుగోడు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బైక్ పై అతివేగంగా వెళ్తూ స్తంభానికి ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదం శుక్రవారం మునుగోడు మండలం ఊకొండి గ్రామశివారులో జరిగింది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊకొండి గ్రామానికి చెందిన మర్రి మురళి(21), బింగి మత్స్యగిరి (20) శుక్రవారం రాత్రి ఊకొండి గ్రామం నుంచి సమీప గ్రామమైన తాళ్ల వెల్లెంలకు బైక్ పై వెళ్తూ గ్రామ శివారులో స్తంభాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మురళి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ ఉండేవాడు మత్స్యగిరి చిట్యాలలో కోళ్లఫారంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామంలో స్నేహితుడి వివాహం సందర్భంగా సందర్భంగా ఇరువురు గ్రామానికి వచ్చి మృత్యువాత పడ్డారు. మత్స్యగిరి తండ్రి యాదయ్యకు ముగ్గురు కుమార్తెలు, మత్స్యగిరి ఒక్కడే కొడుకు. మురళి తండ్రి నరసింహ తల్లి లక్ష్మమ్మకు ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో మురళి పెద్దవాడు మత్స్యగిరి, మురళి చిన్నప్పటి నుంచి స్నేహితులు. ఇరువురు ఒకేసారి బైక్ ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇరువురు స్నేహితులు మృత్యుదనంతో వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సంఘటన స్థలానికి మునుగోడు ఎస్ఐ రవి సందర్శించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


మురళి, మత్స్యగిరి(ఫైల్)

అంధ విద్యార్థులకు సమ్మిళిత విద్యను ప్రవేశపెట్టాలి

నల్లగొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇంటర్, డిగ్రీ, పీజీల్లో అంధ విద్యార్థులకు ప్రత్యేక కళాశాలలు నిర్వహించకుండా సమ్మిళిత విద్యను ప్రవేశపెట్టి చట్టం చేయించాలని రాష్ట్ర మానవ హక్కుల చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తల్‌కు డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, ఏబీసీటీ ఉపాధ్యాయులు పొనుగోటి చొక్కారావు వినతిపత్రం అందజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రానికి షమీమ్ అక్తల్ విచ్చేసిన సందర్భంగా ఆయనను కలిసి సన్మానించారు. పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అంధ విద్యార్థులకు ఇంటిగ్రేటెడ్ విద్యను ప్రవేశపెట్టి చట్టం చేయడం వల్ల అంధులందరికీ ప్రయోజనం ఉంటుందని తెలిపారు. తాను 1981-82లో నాగార్జున డిగ్రీ కళాశాలలో షమీమ్ అక్తల్‌తో కలిసి చదువుకున్నామని ఆయన ఉన్నతస్థాయికి ఎదగడం ఎంతో సంతోషకరమని ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిటైర్డ్ గెజిటెడ్ ఉపాధ్యాయుడు నాగులవంచ వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మే డే వారోత్సవాలను జయప్రదం చేయాలి

కట్టంగూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మే డేను వారోత్సవాలను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం జిల్లా నాయకుడు గంగనబోయిన వీరాంజనేయులు అన్నారు. మండలంలోని మునుకుంట్ల గ్రామంలో శుక్రవారం మేడే వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక వర్గాన్ని కట్టు బానిసత్వానికి గురిచేసే విధంగా బీజేపీ సర్కార్ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లు మార్చే విధానానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. దేశంలో అసంఘటిత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి కనీసం పని భద్రత లేదని, ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు చిలుముల వెంకన్న, నాగరాజు, చంటి, కృష్ణ గణేష్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఆక్సిజన్ ప్లాంట్


● నకిరేకల్ ఆస్పత్రిలో పూర్తి చేయని వైనం
● పరికరాల ఏర్పాటుతో రూ. కోట్ల మేర నిరర్థకం
● వినియోగంలోకి తీసుకురావాలని ప్రజల విన్నపం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో ఆక్సిజన్ కొరత కారణంగా రోగుల ప్రాణాలు గాల్లో కలిశాయి. కరోనా బారినపడి ఆసుపత్రిలో చేరిన బాధితులకు సకాలంలో ఆక్సిజన్ అందించలేని పరిస్థితుల్లో రోగులు చనిపోయిన ఘటనలు అప్పట్లో కలిచివేశాయి. దీంతో స్పందించిన కేంద్రం జాతీయ రహదారుల సంస్థ ద్వారా దేశవ్యాప్తంగా ప్రధాన ఏరియా ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటుకు నిర్ణయించింది. ఇందులో భాగంగానే నకిరేకల్ మునిసిపాలిటీలోని 30 పడకల ఏరియా ఆసుపత్రిలో కూడా ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు పనులు ప్రారంభయ్యాయి. ప్లాంట్ ఏర్పాటు పనులు కొనసాగుతున్న దశలోనే కరోనాకు విరుగుడుగా వ్యాక్సిన్లు రావడం, ప్రభుత్వం చేపట్టిన కఠిన చర్యలతో కరోనా వ్యాప్తి నియంత్రణలోకి రావడంతో రోగుల సంఖ్య తగ్గింది. దీంతో ఆక్సిజన్ అవసరం అత్యవసరం లేకుండా పోయింది. దీంతో ఆయా ఏరియా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్ల పూర్తిపై నీలినీడలు కమ్ముకున్నాయి. అసంపూర్తిగా వదిలేసిన ఫలితంగా రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేస్తున్న ఆక్సిజన్ ప్లాంట్ నిరర్థకంగా మారింది.

మాకు స్వాధీనం చేయలేదు

కరోనా సమయంలో నకిరేకల్ ఏరియా ఆసుపత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. ఓ ఏజెన్సీ ద్వారా ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇప్పటికీ ప్లాంట్‌లో పరికరాలను అమర్చలేదు. ఈ కారణంగా ఆ ప్లాంట్‌ను మాకు స్వాధీనం చేయలేదు. దీంతో ప్లాంట్‌ను ఎలా నిర్వహించాలో కూడా మాకు తెలియదు. పైగా కొత్తగా నిర్మిస్తున్న భవనంలోకి ఏరియా ఆసుపత్రిని తరలించనున్నందున ఆక్సిజన్ ప్లాంట్‌ను ఆ భవనంలో ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నాం.

- శోభ, ఆసుపత్రి సూపరింటెండెంట్



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 40.5 । కనిష్ఠం 25.8

మోడువారుతున్న వనాలు

» ప్రజలకు అక్కరకు రాని పల్లె ప్రకృతి వనాలు




• 6లో

మిర్యాలగూడ మండలం హట్యాతండా పల్లె ప్రకృతి వనంలో మొక్కలను తింటున్న మేకలు

పట్టణ, పల్లె ప్రజలకు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదాన్ని కల్పించడంతోపాటు పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం పల్లె, పట్టణ పకృతి వనాలు, బృహత్ పల్లె పకృతి వనాలను ఏర్పాటుచేసింది. అయితే వీటి నిర్వహణకు నిధులు కేటాయించకపోవడం, వనాల్లో సరైన ఏర్పాట్లు లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఆలనాపాలనా లేక చాలా చోట్ల ఈ వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. కనీసం మొక్కలకు నీరు పోసే దిక్కులేకుండా పోయింది. కనీసం ఇక్కడ కూర్చేనేందుకు బెంచీలు, పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు లేవు. లక్షల రూపాలు ఖర్చుచేసి ఏర్పాటుచేసిన ప్రకృతి వనాలు ప్రస్తుతం చెత్తాచెదారంతో నిండి అలంకారప్రాయంగా మారాయి.ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు ప్రకృతివనాలపై దృష్టిసారించి ఆహ్లాదాన్ని కల్పించాలని పల్లె,పట్టణ వాసులు కోరుతున్నారు.

• ఊంజల్ సేవోత్సవం



యాదగిరిగుట్ట లక్ష్మీఅమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు • 7లో

కొనుఘోల్లు

ధాన్యం విక్రయానికి రైతులకు అవస్థలు తప్పడం లేదు. మిల్లుల వద్ద ధాన్యం కొనుగోళ్లపై నియంత్రణ లేకపోవడంతో మిల్లర్లు చెల్లించే ధరకే సన్న ధాన్యం విక్రయించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. మరోవైపు కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం కాంటాల కోసం రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నారు. సన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించినా, మిల్లర్లు పచ్చి ధాన్యాన్ని కొనుగోలుచేస్తారని ధర తగ్గినా, బోనస్ కోల్పోతున్నా మిల్‌పాయింట్ల వద్దే రైతులు విక్రయిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)



తిప్పర్తి మండల కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం రాశులు

» ధాన్యం విక్రయానికి రైతుల అవస్థలు
» కేంద్రాల వద్ద కాంటాల కోసం పడిగాపులు
» రవాణా, కాంటాల జాప్యంతో ఆవేదన
» బతిమాలితే తప్ప కొనుగోలు చేయని మిల్లర్లు
» ఏపీ రాష్ట్రం, పొరుగు జిల్లాల నుంచి భారీగా వస్తున్న ధాన్యం

రైతుల అవసరాన్ని ఆసరా చేసుకొని ధాన్యంలో నాణ్యత లేదని, మద్దతు ధర చెల్లించేది లేదని మిల్లర్లు మొండికేస్తుండగా రైతులు బతిమాలితేనే ధాన్యం కొనుగోలుచేసే పరిస్థితి ఉమ్మడి జిల్లాలో ఉంది. ఏపీ రాష్ట్రంతో పాటు, తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి మిల్లులకు భారీగా ధాన్యం తరలి వస్తుండడంతో మిల్లర్లు స్థానిక రైతులకు ధరలో కోతవిధిస్తున్నారు. సీజన్ ఆరంభంలో క్వింటాకు రూ.2700 ధర చెల్లించిన మిల్లర్లు ప్రస్తుతం రూ.2200 నుంచి రూ.2400కు మించి ఇవ్వడం లేదు.యాదాద్రి జిల్లాలో సన్నధాన్యం 20వేల మెట్రిక్‌టన్నులకు మించి ఉండదని అంచనావేయగా, దొడ్డురకాలు 5లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనావేశారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మాత్రం సుమారు 12.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్నధాన్యం వస్తుందని అంచనావేశారు. మరో 13లక్షల మెట్రిక్‌టన్నుల దొడ్డురకాల ధాన్యం ఈ జిల్లాలో వస్తుందని చెబుతున్నారు. అందులో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఇప్పటి వరకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు సన్నధాన్యం కేవలం 17వేల మెట్రిక్‌టన్నులలోపే వచ్చింది. దొడ్డురకం ధాన్యం మూడు జిల్లాల్లో కలిపి సుమారు 2.54 లక్షల మెట్రిక్‌టన్నులమేర కొనుగోలు చేశారు.

రవాణా, కాంటాల్లో జాప్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు తీవ్ర జాప్యమవుతున్నాయి. కేంద్రాల వద్ద ఎక్కడ చూసినా వేలాదిబస్తాల ధాన్యం అలాగే ఉంటోంది. సరిపడా లారీలు లేకపోవడం, మిల్లు లు, గోదాముల వద్ద వెంటనే దిగుమతి చేసుకోకపోవడం తదితర కారణాలతో రవాణా తీవ్ర జాప్యమవుతోంది. అదే సమయంలో తేమశాతం ఎక్కువగా ఉందని, తాలు ఉంటుందని చెబుతూ నిర్వాహకులు కాంటాలు వేయడంలో జాప్యం చేస్తున్నారని పలు కేంద్రాల వద్ద రైతులు వాపోతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ధాన్యం కొనుగోలు చేసే దిక్కేలేకపోవడంతో చేసేదేమీలేక 15 రోజుల వరకైనా వేచి ఉండి, ధాన్యం కాంటాలు వేయించి వెళ్తున్నామని రైతులు చెబుతున్నారు.

సూర్యాపేట జిల్లాలో కొనుగోళ్లలో జాప్యం

సూర్యాపేట జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోలులో తీవ్రజాప్యం జరుగుతోంది. ఈ సీజన్‌లో జిల్లాలో 4లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని నిర్ణయించగా, ఇప్పటివరకు కేవలం 56వేల మెట్రిక్‌టన్నుల ధాన్యమే కొనుగోలు చేశారు. అందులో సన్నధాన్యం 13వేల మెట్రిక్‌టన్నులకే పరిమితమైంది. జిల్లాలో మొత్తం 327 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయగా, అందులో 76 కేంద్రాలు సన్నధాన్యానికి కేటాయించారు. తేమశాతం ఎక్కువగా ఉందని కాంటాలు వేయడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రధానంగా లారీలు వెనువెంటనే రాకపోవడంతో...

- మిగతా 7వ పేజీలో...

నల్లగొండ జిల్లాలో కిక్కిరిసిన కొనుగోలు కేంద్రాలు

నల్లగొండ జిల్లాలో వరి కోతలు దాదాపు ముగియడంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ధాన్యం రాశులతో కిక్కిరిసిపోతున్నాయి. ఏ కొనుగోలు కేంద్రం వద్ద చూసినా వేలాది బస్తాల ధాన్యం నిల్వ ఉంది. కేంద్రాల వద్దనే రైతులు ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. భారీగా ధాన్యం వస్తుండడంతో లారీల కొరత ఏర్పడింది. దీంతో కాంటాల కోసం రైతులు కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. ఒక్కో రైతు కనీసం 10 నుంచి 15 రోజుల వరకు ధాన్యం విక్రయించడానికి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సన్నధాన్యం దాదాపుగా మిల్‌పాయింట్ల వద్దనే విక్రయిస్తుండగా, దొడ్డు ధాన్యం పూర్తిగా కొనుగోలు కేంద్రాలకు వస్తోంది.

జిల్లాలో యాసంగి సీజన్‌లో 12.14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనావేయగా, అందులో 11.28లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం మార్కెట్‌కు వస్తుందని, మిల్లర్లు 5.70లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తారని అధికారులు అంచనావేశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సుమారు 5.70లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో సన్నధాన్యం కొనుగోలుకు 71 కేంద్రాలు ఏర్పాటు చేయగా, దొడ్డురకం ధాన్యం కోసం 304 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు సన్నధాన్యం కేవలం 3,524 మెట్రిక్ టన్నులు మాత్రమే ఈ కేంద్రాల్లో సేకరించగా, దొడ్డురకం ధాన్యం సుమారు 1.96లక్షల మెట్రిక్‌టన్నులు కొనుగోలు చేశారు.

సాగర్ ఎడమ కాల్వను పరిశీలించిన

కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్



సాగర్ ఎడమకాల్వ వద్ద ప్రాజెక్టు అధికారులతో కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్

నాగార్జునసాగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలోని ఎడమ క్వాలను కేఆర్ఎంబీ చైర్మన్ అతుల్‌జైన్ శుక్రవారం సందర్శించారు. రెండు రోజుల సాగర్ పర్యటనలో భాగంగా గురువారం ఇక్కడికి వచ్చిన ఆయన తొలిరోజు సాగర్ ప్రధాన డాం, కుడి కాల్వ, కుడి కాల్వపై ఉన్న జల విద్యుత్ కేంద్రం, ప్రధాన జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. రెండో రోజు శుక్రవారం తిరుగు ప్రయాణంలో ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటరీ, ఎడమ కాల్వపై ఉన్న జల విద్యుత్ కేంద్రాన్ని పరిశీలించారు. ఎడమ కాల్వ నీటి విడుదల వివరాలను, జల విద్యుత్ కేంద్రం విద్యుత్ ఉత్పత్తి ద్వారా చేస్తున్న నీటి విడుదల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ప్రాజెక్టు ఈఈ మల్లిఖార్జునరావు, ఇతర అధికారులు ఉన్నారు.

ఖైదీల్లో మార్పు వచ్చేలా చూడాలి

రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీంఅక్తర్



జైలు అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న షమీంఅక్తర్

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): జైలులో ఉన్న ఖైదీల్లో మార్పు వచ్చేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీంఅక్తర్ అన్నారు. శుక్రవారం నల్లగొండలోని జిల్లా జైలును ఆయన తనిఖీచేసి బ్యారక్స్, వంటగది, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఖైదీలతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లా జైలులో సుమారు 177 మంది ఖైదీలు ఉన్నారని, అందులో 21 మంది మహిళా ఖైదీలు ఉన్నారన్నారు. జైలులో సౌకర్యాలన్నీ పరిశీలించి ఖైదీలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్టు చెప్పారు. ఇక్కడ అన్ని సౌకర్యాలు ఉన్నాయని, ఖైదీల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేవన్నారు. ఆయన వెంట జైలు సూపరింటెండెంట్ ప్రమోద్, జిల్లా జైలర్ బాలకృష్ణ ఉన్నారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్‌కు ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరామిరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు, ప్రభుత్వ ఆసుపత్రులు, సంక్షేమ హాస్టళ్ల ద్వారా అందిస్తున్న సేవలు, ఇతర కార్యక్రమాలను అధికారులు ఆయనకు వివరించారు. అదేవిధంగా చైర్మన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి మర్యాదపూర్వకంగా కలసి పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు.

మా చెల్లెలి ఆచూకీ చెప్పకపోతే

మిమ్మల్ని చంపుతాం.. లేదా మేం చస్తాం

మహిళా ఎస్‌ఐ, కుటుంబీకుల హల్‌చల్ • 8లో

సమస్యల పరిష్కారమే భూభారతి లక్ష్యం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



దామరచర్లలో భూభారతి అవగాహన సదస్సులో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా భూభారతి చట్టాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ, దామరచర్ల, అడవిదేవులపల్లి, వేములపల్లి మండల కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా ఉన్న వారసత్వ, వివిధ రకల భూముల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. గతంలో ప్రభుత్వం పేదలకు అందించిన అసైన్డ్ భూముల్లో క్రయవిక్రయాలకు అనుమతి లేకున్నా, కొందరు వారి అవసరాల కోసం అవగాహన లోపంతో విక్రయించారన్నారు. గతంలో రికార్డుల్లోకి ఎక్కిన భూములను సైతం పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 14 నెలల పాటు నిపుణుల కమిటీ పర్యవేక్షణలో నూతన భూభారతి చట్టాన్ని రూపొందించిందన్నారు. ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పేదల పక్షపాతి అని అన్నారు. అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను తిరిగి పునరుద్ధరించనుందన్నారు. ధరణిలో అప్పీల్ వ్యవస్థ లేదని, తహసీల్దార్ తప్పు చేస్తే భూభారతి చట్టంలో సవరించే అవకాశం ఆర్డీవోకు ఉందన్నారు. భూముల సర్వే కోసం లైసెన్స్ సర్వేయర్లకు శిక్షణ ఇచ్చి నియమించనుందన్నారు. దీంతో రైతుల భూములకు హద్దులు కల్పించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఫలాలు పేదలకు చేరేలా అధికారులు, కిందిస్థాయి సిబ్బంది కృషి చేయాలన్నారు. వజీరాబాద్ మేజర్ పరిధి 37కిలోమీటర్ల మేర ఉండగా గతంలో 20వేల నుంచి 30వేల ఎకరాలు మాత్రమే సాగు కాగా, ప్రస్తుతం 45వేల ఎకరాలు సాగులోకి వచ్చాయన్నారు. పూర్తిస్థాయిలో భూప్రక్షాళన చేసి అర్హులైన రైతులకు పట్టాలను అందజేస్తామన్నారు. లక్ష్మీపురం గ్రామంలో 2022లో 437 సర్వే నెంబర్‌లో 4.37 ఎకరాల భూమి కొనుగోలు చేసినా అప్పటి ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందని, తాను ఎమ్మెల్యేగా గెలిచాక, ఆ భూమిని చదును చేయించి పేదలకు పట్టాలు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఇళ్లు లేని 80మంది నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేశారు. కలెక్టర్‌తో పలువురు గిరిజన మహిళలతో కలిసి వారి సంప్రదాయ నృత్యం చేయడం ఆకట్టుకుంది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నారాయణ్‌అమిత్, తహసీల్దార్లు హరిజవహర్‌లాల్, శ్రీనివాస్, పుష్పలత, హరిబాబు, ఎంపీడీవో శారదాదేవి, డీటీ కోటేశ్వరి, ఆర్‌ఐలు మహేందర్‌రెడ్డి, స్పందన, నాయకులు పొదిల శ్రీనివాస్, మాలి కాంతారెడ్డి, రావు ఎల్లారెడ్డి, సతీష్‌రెడ్డి, ప్రవీణ్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ మండలం లక్ష్మీపురంలో పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బీఎల్‌ఆర్

రజతోత్సవ సభను

విజయవంతం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో ఈ నెల 27వ తేదీన నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రె స్ హామీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలిరావడానికి ప్రజలు ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. రజతోత్సవ సభను ప్రజలు కాంగ్రెస్ వ్యతిరేక సభగా భావిస్తున్నారని, కేసీఆర్ మాట్లాడేది వినేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలిరానున్నారని అన్నారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్యలో ఉండి కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ అని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు యోల్గురి వల్లపురెడ్డి, నాయకులు ముత్యంరావు, ఆర్వపల్లి నర్సింహ, ఎర్ర యాదగిరి, రాయనబోయిన శ్రీను, సుధాకర్‌గౌడ్, బోడ్డుపల్లి మహేందర్, మన్యానాయక్, కృష్ణారెడ్డి, హరిరాథోడ్, వెంకటయ్య, అనిల్, రవి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



చిట్యాలలో పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

చిట్యాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చిట్యాల పట్టణంలో జాతీయరహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నందున ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం చిట్యాల వద్ద జాతీయ రహదారిపై నిర్మిస్తున్న ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ, పనులు కొనసాగుతున్నందున రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. హైవేపై ట్రాఫిక్‌జామ్ ఏర్పడకుండా, వాహనాలు సాఫీగావెళ్లేలా ట్రాఫిక్‌ను డైవర్షన్ చేయాలన్నారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయనవెంట డీఎస్పీ శివరాంరెడ్డి, సీఐ నాగరాజు, ఎస్ఐ ధర్మా, తదితరులు ఉన్నారు.

వ్యవసాయ మోటార్ల

చోరీ ముఠా అరెస్టు

నిందితులంతా ఒకే గ్రామానికి చెందిన స్నేహితులు • 7లో

అమాయకులపై ఉగ్రదాడి హేయం

ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి హేయమైనదని ఎమ్మెల్సీ శంకర్‌నాయక్ అన్నారు. పెహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ టీపీసీసీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి మృతులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యాటకులపై తూపాకుల తూటాలు పేల్చడాన్ని యావత్ దేశమంతా ఖండిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బుర్రిశ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, గోపగాని మాదవి, దుబ్బ అశోక్, వంగూరు లక్ష్మయ్య, దుబ్బరూప, నాగమణిరెడ్డి, నాగరాజు, ఇంతియాజ్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

మిర్యాలగూడటౌన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మానవ సేవే మాధవ సేవ అని సోషల్ వర్కర్ ధీరావత్ హన్యానాయక్ అన్నారు. ఫెయిత్ బంజారా ఆశ్రమం ఆధ్వర్యంలో శుక్రవారం పెరుగన్నం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి ఎండ తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో యాచకులు, బాటసారులకు పెరుగన్నం, చల్లని నీరు అందించినట్లు తెలిపారు. ప్రతీవారం పెరుగన్నం పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రమాబాయి, జనార్ధన్ పాల్గొన్నారు.

సకాలంలో డబ్బులు చెల్లించాలి

చింతపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రైతులకు ధాన్యం డబ్బు సకాలంలో అందేలా చూడాలని తహసీల్దార్ రమాకాంత్‌శర్మ తెలిపారు. చింతపల్లి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేం ద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చొరవ తీసుకోవాలన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

'సమూహ సంగమం'ను విజయవంతం చేయాలి

● మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు



సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నేతలు

మిర్యాలగూడ, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): సమూహ సంగమం సదస్సును విజయవంతం చేయాలని మట్టిమనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు అన్నారు. పట్టణంలోని మినీ రవీంద్రభారతిలో శుక్రవారం వివిధ సంఘాల నాయకులతో కలిసి కలిసి సదస్సు కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సామాజిక ఉద్యమాల గొంతుక, కవి రచయిత, ఉపాధ్యాయుడు కస్తూరి ప్రభాకర్ పదవీవిరమణ సందర్భంగా మే 1న మినీ రవీంద్రభారతి ఆడిటోరియంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, మట్టిమనుషులు, సమూహ, తెలంగాణ విద్యావంతుల వేదికల ఆధ్వర్యంలో విద్యా, సామాజిక, సాహిత్య అంశాలతో కూడిన సామూహ సంగమం సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, ఆర్ట్స్ కాలేజీ ప్రొఫెసర్ చింతకింది కాశీం, చాకలి అయిలమ్మ మహిళా యూనివర్శిటీ వీసీ సూర్యా ధనుంజయ్, నందిని సిదారెడ్డి పాల్గొనున్నట్లు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు సదస్సుకు హాజరుకావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, వివిధ సంఘాల నాయకులు మైబూబ్ అలీ, పరమేష్, మారం శ్రీనివాస్, యాదగిరిరెడ్డి. బిక్షమయ్య, డైమండ్ శ్రీను కస్తూరి ప్రభాకర్, జయరాజు, రేఖ, కిరణ్మయి, తక్కెళ్లపల్లి సైదులు, హఫీజ్ పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

దామరచర్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ సమస్యలు పట్టించుకోని, అవినీతికి పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వాడపల్లి గ్రామస్థులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని వాడపల్లిలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, కలుషిత నీరు వస్తుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో పారిశుధ్య చర్య లు తీసుకోవడంలో కార్యదర్శి విఫలమయ్యాడ ని ఆరోపించారు. గతంలో నిధులు దుర్వినియోగం చేసిన విషయంలో సస్పెండ్ చేశారు. కొద్ది రోజులకే అతనికే మళ్లీ బాధ్యతలు అప్పగించడంతో సమస్య మొదటికి వచ్చిందని వారు ఆరోపించారు. ఉ న్నతాధికారులు తక్షణమే స్పందించి కార్యదర్శిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులతో పాటు అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండి.యూసుఫ్, దేవండ్ల సుబ్బయ్య, చిట్టిపోలు సైదయ్య, చెన్నకేశవులు, మారెల్ల రాంరెడ్డి, కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఎం.మల్లేపల్లికి అంబులెన్స్ సౌకర్యం

చింతపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.మల్లేపల్లికి చెందిన సులుగురు ముత్యాలమ్మ, యాదయ్య కుమారులు సొంత నిధులతో గ్రామానికి శుక్రవారం అంబులెన్స్‌ను ఉచితంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ముద్దం బుచ్చమ్మకృష్ణయ్య మాట్లాడుతూ గ్రామంలో ఎవరికైనా ఇబ్బంది తలెత్తితే వారిని ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ఉపయోగేపడే అంబులెన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సులుగురు శేఖర్, జగన్, గండు వెంకటయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యల పరిష్కారం



అవగాహన సదస్సులో పాల్గొన్న సంఘం సభ్యులు

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న భూభారతి కార్యక్రమంలో భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్టీఐ సమాచార హక్కు ప్రచార సమితి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాట్రావత్ రాజునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ఆవరణలో శుక్రవారం ప్రచారం సమితి ఆధ్వర్యంలో భూభారతి చట్టం-2025పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టం-2025పై తమవంతుగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సరికొండ జనార్దన్‌రాజు, వెంకటేష్, ఇస్లావత్ రమేష్, రమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

మా చెల్లెలి ఆచూకీ చెప్పండి

● మిమ్మల్ని చంపుతాం.. లేదా మేం చస్తాం
● మహిళా ఎస్ఐ, కుటుంబీకుల హల్‌చల్

మిర్యాలగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న తన చెల్లెలు ఆచూకీ చెప్పాలని తమను బెదిరించారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు మహిళా ఎస్ఐ, కుటుంబసభ్యులపై కేసు నమోదైంది. గురువారం మిర్యాలగూడలో ఈ సంఘటన జరిగింది. నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) రాజవరం గ్రామానికి చెందిన ఎలకాని మౌనిక, ఎలకాని భార్గవి అక్కాచెల్లెళ్లు కాగా, మౌనిక హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఏఆర్ కానిస్టేబుల్ నరేందర్‌ను మౌనిక ప్రేమ వివాహం చేసుకుంది. ఆమె సోదరి భార్గవి హైదరాబాద్‌లో ఎంఎస్సీ పూర్తి చేసి బీఈడీ చదువుతోంది. మిర్యాలగూడ మండలం ఉట్లపల్లి మైనంవారిగూడెంకు చెందిన పెద్దింటి శివ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ విభాగంలో పని చేస్తున్నాడు. ప్రేమించుకున్న వీరిద్దరూ తమ వివాహానికి తల్లిదండ్రులు ఒప్పుకోరని భావించి మార్చి 31వ తేదీన చెర్వుగట్టు దేవస్థానంలో వివాహం చేసుకున్నారు. వివాహ నమోదు నిమిత్తం మిర్యాలగూడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవటంతో భార్గవి, శివల పెళ్లి గురించి ఆమె తల్లిదండ్రులకు తెలిసింది.

ఎస్పీని ఆశ్రయించిన నవ దంపతులు

మహిళా ఎస్ఐ మౌనిక నుంచి తమకు ప్రాణహాని ఉందని భార్గవి, శివ దంపతులు ఇటీవల నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్‌ను సంప్రదించారు. దీంతో సదరు ఎస్ఐ, ఇరువర్గాల బంధువులకు కౌన్సిలింగ్ ఇచ్చి మిర్యాలగూడ డీఎస్పీ వద్దకు పంపారు. ఇరువురు మేజర్ అయినందున వారిని విడదీయలేమని డీఎస్పీ రాజశేఖర్‌రాజు ఇరువర్గాలకు నచ్చజెప్పి పంపారు. అప్పటినుంచి నవ దంపతులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లారు.

శివ మేనమామ ఇంటి ఎదుట హల్‌చల్

శివ, భార్గవిల ఆచూకీ తెలియకపోవటంతో ఎస్ఐ మౌనిక, తల్లి సుగుణ, చిన్నమ్మ నాగమ్మ, హైదరాబాద్‌కు చెందిన మౌనిక స్నేహితురాలు పింకీ, డ్రైవర్ అజయ్, మౌనిక డ్రైవర్ కిరణ్‌లు గురువారం మిర్యాలగూడలోని శివ మేనమామ మేకల నాగరాజు ఇంటికి వచ్చారు. 'భార్గవి, శివలను మీరు దాచిపెట్టారంటూ నానా దుర్భాషలాడారని, మిమ్మల్ని చంపుతాం, లేదంటే మేము మీ ఇంటి ముందు పెట్రోల్ పోసుకుని చస్తాం. వారు ఎక్కడ ఉన్నా తీసుకొస్తారా లేదా" అంటూ భయభ్రాంతులకు గురిచేశారని నాగరాజు మిర్యాలగూడ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్ వివరణ కోరగా శివ మేనమామ నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మౌనిక, తల్లి సుగుణ, చినమ్మ నాగమ్మ, స్నేహితురాలు పింకీ, ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రాణవాయువు కొనాల్సిందే..!



మిర్యాలగూడ పట్టణంలోని ఆస్పత్రి, (ఇన్‌సెట్‌లో) దేవరకొండలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్

» అవసరాన్ని బట్టి దిగుమతి
» ఒక్కో ఆక్సిజన్ సిలిండర్‌కు రూ.600 చెల్లింపు
» ఆర్థికంగా నష్టపోతున్న పేదలు

మిర్యాలగూడఅర్బన్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రోగుల ఆరోగ్య పరిస్థితి విషమించిన అత్యవసర పరిస్థితిలో ప్రాణవాయువు అందించడం కష్టమవుతోంది. ప్రధాన రహదారులపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో అపస్మారక స్థితిలోకి వెళ్లిన క్షతగాత్రులకు ఆక్సిజన్ దొరకని పరిస్థితి నెలకొంది. అవసరాన్ని బట్టి ప్రైవేట్ కంపెనీ నుంచి సిలిండర్లను కొనుగోలు చేయాల్సిన వస్తోంది. ఇదీ మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో పరిస్థితి. వంద పడకల సామర్థ్యంతో నిర్మితమైన ఆస్పత్రిలో అత్యవసర సమయాల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడుతోంది. ప్రసూతి వార్డులో సాధారణ ప్రసవాలకు వీలు పడని సందర్భాల్లో సిజేరియన్ చేయాల్సి వస్తే ఆపరేషన్ థియేటర్‌లో ఆక్సిజన్ సిలిండర్‌ను సమకూర్చుకునేందుకు వైద్యులు తాపత్రయపడాల్సి వస్తోంది. ఇదే ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి 10 యూనిట్ల ద్వారా డయాలసిస్ రోగులకు రక్తశుద్ధి చేస్తున్నారు. నిత్యం 35 నుంచి 40మంది రోగులు ఇక్కడ డయాలసిస్ సేవలు పొందుతున్నారు. శ్వాసకోశ వ్యాధి లక్షణాలు కలిగి ఉన్న రోగులకు ఆక్సిజన్ అందించక తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితిలో ప్రైవేట్ కంపెనీల నుంచి దిగుమతి చేసుకునే ఆక్సిజన్ సిలిండర్లను వాడాల్సి వస్తోంది. దీంతో ఒక్కో సిలిండర్‌కు రూ.600 వరకు ఖర్చు చేస్తున్నారు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్ వార్డు, అత్యవసర గదిలో రోగుల సంఖ్య పెరిగిన సందర్భాల్లో వారానికి 10 ఆక్సిజన్ సిలిండర్లను వినియోగిస్తుంటారు. అందుకు సగటున రూ.6 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుతో విద్యుత్ వినియోగం పెరిగి కరెంటు బిల్లు భారం అధికమవుతుందన్న భావనతో ఆస్పత్రిలో ప్లాంట్ ఏర్పాటుకు అంతగా శ్రద్ధ చూపడం లేదు. దీంతో కొన్నేళ్లుగా బహిరంగ మార్కెట్‌లో లభించే ప్రైవేట్ కంపెనీ ఆక్సిజన్ సిలండర్లను వినియోగిస్తున్నారు. అందుకు ప్రతీ నెలా రూ.50 నుంచి 80 వేల వరకు ప్రైవేట్ కంపెనీలకు ఆక్సిజన్ సిలిండర్ బిల్లులు చెల్లిస్తున్నారు. తాజాగా మరో వంద పడకల సామర్థ్యంతో నూతన ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నారు. అవసరాన్ని బట్టి ఈ భవనం వినియోగంలోకి తెచ్చే సందర్భంలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలన్న యోచనలో వైద్యశాఖ ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.

ఆక్సిజన్ ప్లాంట్‌తో అధిక భారం

దేవరకొండ: దేవరకొండ ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో 2020లో నేషనల్ హైవే అథారిటీ, కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో డీఆర్‌డీవో ద్వారా రూ.5 కోట్లతో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ప్లాంట్‌ను ఉపయోగంలోకి తెస్తే విద్యుత్ బిల్లు అధికమవుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ పేర్కొంటున్నారు. 2020లో కరోనా విజృంభిస్తుండటంతో కట్టడి చేసేందుకు కేంద్రప్రభుత్వం అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. కాని నిర్వహణ లేకపోవడంతో ఆ ప్లాంట్ నిరుపయోగంగా మారింది. ఆక్సిజన్ ప్లాంట్ ఉపయోగంలో లేకున్నా విద్యుత్ బిల్లు నెలకు రూ.30వేల వరకు వస్తుందని, దీంతో ఆర్థికంగా భారమవుతుందని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో వంద పడకలకు గాను ప్రతీ రోజు 700 నుంచి 800 మంది రోగులు వస్తుంటారు. ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్‌తో పాటు ఆక్సిజన్ సిలిండర్లు రోగులకు సరిపడా ఉన్నాయి. ఇటీవల కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆసుపత్రిని సందర్శించి అత్యవసర సమయంలో ఆక్సిజన్ అవసరాల నిమిత్తం రూ.1.50 లక్షల వ్యయంతో ఆక్సిజన్ కన్సన్‌డేటర్ మంజూరు చేశారు. ప్రస్తుతం ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరత లేదని ప్లాంట్ ఉపయోగంలోకి తెస్తే విద్యుత్ భారమవుతుందని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు.

ఆక్సిజన్ ప్లాంట్‌తో అధికభారం

దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి 2020లో ఆక్సిజన్ ప్లాంట్ మంజూర,ఐంది. నిర్వహణ భారం మాపైనే పడింది. ఉపయోగించకున్నా విద్యుత్ బిల్లు అధికంగా వస్తుంది. ప్లాంట్‌తో పాటు సిలిండర్లు, ఆక్సిజన్ కాన్సన్‌డేటర్లు ఆసుపత్రిలో రోగులకు సరిపడా ఉన్నాయి. ఎలాంటి ఇబ్బంది లేదు. ఆక్సిజన్ ప్లాంట్‌తోనే అధికభారం అవుతుంది.

\- డాక్టర్ రవిప్రకాష్,
సూపరింటెండెంట్, దేవరకొండ

సిలిండర్లు దిగుమతి చేసుకుంటున్నాం



ఆస్పత్రిలో ఆక్సిజన్ వినియోగాన్ని బట్టి ప్రైవేట్ కంపెనీలు సరఫరా చేసే ఆక్సిజన్ సిలిండర్లను దిగుమతి చేసుకుంటున్నాం. ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేయకపోవడంతో బహిరంగ మార్కెట్లో లభించే సిలిండర్లను వాడాల్సి వస్తోంది. కంపెనీల నాణ్యతప్రమాణాలకు ప్రాధాన్యతనిస్తున్నాం. ప్రస్తుతం ఆస్పత్రిలో ఆక్సిజన్ సిలిండర్లు అవసరానికి అనుగుణంగా అందుబాటులో ఉంచి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

\- డాక్టర్ శ్రీనివాస్ సమరద్, సూపరింటెండెంట్,మిర్యాలగూడ

ఉగ్రవాదులపై కఠినచర్యలు తీసుకోవాలి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

జమ్మూకాశ్మీర్ పహల్గాంలో దాడి చేసిన ఉగ్రవాదులపై కఠినచర్యలు తీసుకోవాలని వివిధ పార్టీలు, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం దాడిని నిరసిస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదుల జరిపిన దాడి పిరికిపందల చర్యగా అభివర్ణించారు. వివిధ సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అమాయకులైన పర్యాటకుల ప్రాణాలను బలితీసుకున్న ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని అన్నారు. అమరులైన పర్యాటకుల కుటుంబాల ను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

● దేవరకొండలో జమాయత్ ఉలేమా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మహమ్మద్ ముక్తి జావిద్ హుస్సేన్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అజీముద్దీన్, మహమ్మద్ ఫరూక్‌మౌలానా, మజీద్ మౌలానా, రహత్‌అలీ, ఇలియాజ్ పాల్గొన్నారు. దేవరకొండలో సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, నాయకులు పల్లా దేవేందర్‌రెడ్డి, దేప సుదర్శన్‌రెడ్డి, పాండురంగారెడ్డి, అంజనేయులు పాల్గొన్నారు.

నిడమనూరులో మండల కేంద్రంలోని మున్సిఫ్ కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉన్నం చిన వీరయ్య, పెద్దబోయిన శ్రీనివాస్ యాదవ్, బీఎస్ఎన్ రాజు, అబ్దుల్ హలీం, కోటేశ్వర్‌రెడ్డి, వినోద్, నాగరాజు, సతీష్, వెంకన్ననాయక్ పాల్గొన్నారు.

నాగార్జునసాగర్‌లోని మజీదులల్లో ముస్లింలు నమాజ్ అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో షబ్బీర్, గౌస్, యుజీబ్, జావీద్, మతీన్, కలీల్, లతీఫ్, అష్రఫ్, యూసుఫ్ పాల్గొన్నారు.

మిర్యాలగూడలో టీడీపీ ఓబీసీ విభాగం రాష్ట్ర నాయకుడు పోగుల సైదులుగౌడ్ ఆధ్వర్యంలో దాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్నాటి శివరామకృష్ణ, గుణగంటి వెంకన్న, వడ్డెబోయిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.

హాలియాలో హిందూ సంఘం, అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో మానవహారం నిర్వహించారు. ఉగ్రవాద ముసుగులో పర్యాటకులను పొట్టన పెట్టుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, గుర్రం ప్రభాకర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మురళి, వర్ర వెంకట్‌రెడ్డి, కొమ్మనబోయిన చంద్రశేఖర్, సుధాకర్‌రెడ్డి, చేగొండి కృష్ణ, కాకునూరి చినరాయణ పాల్గొన్నారు.

హాలియాలో ముస్లిం మైనార్టీలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అన్వరుద్దీన్, మజహర్, మస్జీద్ ఇమామ్ వహీద్, మైనార్టీ నాయకులు అబ్రాన్, అంజాద్‌ఖాన్, హమీద్, జాహెద్, రషీద్‌పాల్గొన్నారు.



దేవరకొండలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ఈద్గా కమిటీ, ముస్లిం మతపెద్దలు

చింతపల్లి మండలంలోని వెంకటేశ్వరనగర్ (గొడుకొండ్ల)లో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనిగిరి గోవర్ధన్, రాజేష్‌సాగర్, లక్ష్మణ్ సాగర్, పులిరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

నిడమనూరు మండలం ముప్పారం గ్రామంలో స్థానికులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కోట్ల సైదులు, తెల్కపల్లి శంకర్, దారం యాదగిరి, కంచి పాపయ్య, మర్రి శ్రీను, కంచి శ్రీను, రవి, మల్లప్ప, అన్నెబోయిన లక్ష్మీనారాయణ, స్వరాజ్యం పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

● పరారీలో ఐదుగురు

త్రిపురారం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. ఈ సంఘటన శుక్రవారం మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని వెంకటసాయి రైస్ మిల్లు వెనుక ఉన్న తాళ్ల శ్రీధర్‌రెడ్డి వ్యవసాయ పొలంలో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం సాయంత్రం పోలీసులకు తెలిసింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట ఆడుతున్న స్థలానికి వెళ్లారు. వారిని గమనించిన జూదరులు కొందరు పరారీ కాగా ముగ్గురు పోలీసులకు దొరికారు. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన వంచ రవీందర్‌రెడ్డి, మచ్చ శ్యామ్, సజ్జల శ్రీనివాస్‌రెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.7200 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే వీరితో పాటు పేకాట ఆడుతున్న కోట దుర్గయ్య, వెంకన్న, మేకపోతుల శ్రీను, కొమ్మరాజుల నాగరాజు, కంచుగట్ల లింగప్రసాద్ అనే ఐదుగురు పోలీసులకు చిక్కకుండా పారిపోయారు. వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు. పేకాట ఆడుతున్న సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

మేడేను విజయవంతం చేయాలి : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

దేవరకొండ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మేడేను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ అన్నారు. దేవరకొండ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వాడ, వాడలా జెండాలను ఎగురవేయాలని కోరారు. కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మేడేతో పాటు 20వ తేదీన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య, నాయకులు యాదగిరి, నాగరాజు, బిజిలి లింగయ్య, బాలయ్య, బొడ్డ పాల్గొన్నారు.

పెద్దవూర: మేడే కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్‌కె.బషీర్ అన్నారు. మండల కేంద్రంలో మేడే కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎందరో ప్రాణత్యాగం ఫలితంగా హక్కులను సాధించుకున్నామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బ రామచంద్రయ్య, దొంతాల నాగార్జున, దోరేపల్లి మల్లయ్య, ఊరే ప్రభాకర్, ఈగల సంజీవ్, రమేష్ పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు హాజరుకావాలి

● మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఏర్పాటై 25 వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభను నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. బహిరంగ సభకు అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, అన్నభీమోజు నాగార్జునాచారి, నల్లమోతు సిద్దార్థ, ముగ్దుంపాషా, వాజీద్, షనాహజ్ బేగం, పిన్నబోయిన శ్రీనివాస్‌యాదవ్, ఇలియాస్, శ్రీధర్‌రెడ్డి, సాధినేని శ్రీనివాసరావు, శ్యామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

డిండి: వరంగల్‌లో ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాజినేని వెంకటేశ్వరరావు కోరారు. మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు వనరులను దోచుకుంటూ తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.

నారమ్మగూడెంలో గుడిసె దగ్ధం

● పేలిన సిలిండర్ ● ఎవరూ లేకపోవడంతో తప్పిన ముప్పు



పూర్తిగా దగ్ధమవడంతో బూడిదైన సామగ్రి

నిడమనూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. అంతేకాక గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా పేలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన నిడమనూరు మండలం నారమ్మగూడెం శివారులో శుక్రవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఏపీలోని ఒంగోలు జిల్లాకు చెందిన కొందరు బాతులు మేపుకునేందుకు నారమ్మగూడెం వచ్చి గ్రామ శివారులోని ఓ వ్యవసాయ భూమిలో గుడిసె వేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం గుడిసెలో ఉంటున్న వారు బాతులు మేపుకునేందుకు వెళ్లారు. సాయంత్రం సమయంలో కొందరు పొలాల్లోని వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో ప్రమాదవశాత్తు గుడిసెకు అంటుకొని గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో ఉన్న బియ్యం, దుస్తులు, మంచాలు, వస్తు సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. దీంతో పాటు గుడిసెకు నిప్పంటుకోవడంతో అందులో ఉన్న గ్యాస్ సిలిండర్ కూడా ఒక్కసారిగా పేలి ముక్కలు ఎగిరి పడ్డాయి. సిలిండర్ పేలడంతో పెద్ద శబ్దం వచ్చినట్లు చెబుతున్నారు. ఆ సమయంలో గుడిసెలో, ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఆ సమయంలో అక్కడ ఎవరైనా ఉంటే ప్రాణనష్టం జరిగేదని స్థానికులు వాపోతున్నారు. కాగా నారమ్మగూడెం శివారులో గుడిసెకు నిప్పు అంటుకోవడంతో గ్యాస్ సిలిండర్ పేలినట్లు సమాచారం లేదని, ఫిర్యాదు కూడా అందలేదని ఎస్ఐ ఉప్పు సురేష్ తెలిపారు.

కన్నుల పండువగా రథోత్సవం

చింతపల్లి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.మల్లేపల్లిలో కుర్మచాల రామచంద్రస్వామి ఆలయంలో రథోత్సవాన్ని శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదబ్రాహ్మణుల నేతృత్వంలో ఉత్సవమూర్తులను రథోత్సవంపై ఏర్పాటు చేసి కుంభబలి, రథాంగహోమం, అష్టాదిక్పాలక, క్షేత్రపాలక బలి, తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ధర్మకర్త వింజమూరి లక్ష్మణ్‌శర్మ, పురోహితులు వైద్యుల రవీంద్రనాథ్‌శర్మ, శ్రీనాథ్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, నిర్వాహకులు గండు వెంకటయ్య, శ్రీనివాస్, ముద్దం కృష్ణయ్య, తమ్మడగోని హన్మంతు, నరసింహ, క్రాంతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సమ్మిడి ప్రకాష్‌రెడ్డి, విజయ్‌రాంరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కేతావత్ లాలునాయక్, నాయకులు గోపిడి అనిల్‌రెడ్డి, దావా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మర్ల ప్రేమలత వెంకటయ్య, తమ్మడగోని హన్మంతు, కుంచరాపు క్రాంతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

డిండి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన డిండి మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాల ఆవరణంలోని ముళ్ల పొదలలో సుమారు 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహం పడి ఉంది. గోధుమరంగు చొక్కా, బ్లూ కలర్ ప్యాంట్, ఎడమచేతికి నల్లని బెల్టుతో ఉన్న వాచ్ ధరించి ఉన్నాడు. తలకు పింకు బ్లూ మిక్స్ రంగు కలిగిన టవల్ ధరించి ఉన్నాడు. నుదుటిపై రక్తపు చారలు కనిపిస్తున్నాయి. పాత ప్లాస్టిక్ ఇనుప సామాను వ్యక్తి మృతదేహంగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. పంచాయతీ కార్యదర్శి శిరీష ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జి ఎస్ఐ సతీష్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.